
# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 227 | హైదరాబాద్ | సోమవారం 02-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00

11లో

ఈ హత్య కిరాతకమైన చర్య... ఖమేనీ మరణంపై ఘాటుగా స్పందించిన పుతిన్

## మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు

## తెలుగువారికి.. సీఎం రేవంత్ రెడ్డి సూచన

- గల్ఫ్ దేశాల్లోని తెలుగువారు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ సూచన
- ఎంబసీల మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు పాటించాలని పిలుపు
- బహ్రెయిన్‌లోని తెలుగువారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న ఏపీ స్పీకర్ అయ్యన్న
- అవసరమైతే కేంద్రంతో మాట్లాడి క్షేమంగా రప్పిస్తామని హామీ

11లో



## సీఎం ప్రజావాణికి రెండేళ్లు..

# 47 వేల దరఖాస్తులు పరిష్కారం

- ప్రతి శాఖ నుంచి అధికారులతో ప్రత్యేక డెస్కులు
- పరిష్కారం కాని దరఖాస్తులు 47,687
- అక్కడికక్కడే సమస్యల పరిష్కారం
- సీఎం ప్రజావాణిపై ప్రజల్లో భరోసా
- చిన్నారెడ్డి, దివ్యదేవరాజన్ ప్రత్యేక శ్రద్ధ

11లో






11లో

## అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటు చేయండి

### సీజేఐని కోరిన సీఎం చంద్రబాబు

- ఏపీ రాజధానిలో అంతర్జాతీయ ప్రమాణాలతో జస్టిస్ సిటీ నిర్మాణం
- మధ్యవర్తిత్వంతో కేసు పరిష్కారమైతే రూ.10 వేలు.. లేకుంటే రూ.3 వేల సాయం
- న్యాయ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం
- వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి

## అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సైన్యాధిపతి మౌసవి మృతి



- టెహ్రాన్‌లో రక్షణ మంత్రి, ఐఆర్‌జీసీ చీఫ్‌తో పాటు ఏడుగురు కమాండర్ల మరణం
- సుప్రీం లీడర్ ఖమేనీ మృతిని ధృవీకరించిన ఇరాన్ ఆర్మీ
- అమెరికా, ఇజ్రాయెల్ పై తీవ్ర స్థాయిలో ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరిక

11లో

## పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు... ఇండిగో 350 సర్వీసులు రద్దు

- అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ ఉద్రిక్తతలతో గగనతల మూసివేత
- ప్రపంచవ్యాప్తంగా 700కు పైగా విమాన సర్వీసులు రద్దు
- గల్ఫ్ రూట్లలో ఆంక్షలు.. మూడు రోజుల్లో 350కి పైగా ఇండిగో విమానాలు రద్దు
- ఆసియా, యూరప్, అమెరికా మధ్య నడిచే విమానాలపై తీవ్ర ప్రభావం
- చుట్టు తిరుగుడు ప్రయాణాలతో విమానయాన సంస్థలపై ఆర్థిక భారం




11లో



## మూసీ ముసుగులో విధ్వంసం వద్దు: కేటీఆర్

- హైదర్‌షాకోట్‌లో బీఆర్ఎస్ పాదయాత్ర
- బాధితులకు అండగా ఉంటామని భరోసా
- భారీగా తరలివచ్చిన అపార్ట్‌మెంట్ నివాసితులు


హైదరాబాద్ మార్చ్ 01 (భారతశక్తి): మూసీ సుందరీకరణ పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఆస్తులను ధ్వంసం చేయాలని చూస్తే సహించేది లేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు హెచ్చరించారు. శనివారం రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని హైదర్‌షాకోట్ నుంచి మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ల వరకు ఆయన పాదయాత్ర నిర్వహించారు. ప్రభుత్వం

తరువాయి 12లో

## బల్దియా ఖజానాకు

# 100ల కోట్ల అవినీతి గండి...!

జీహెచ్ఎంసీ (GHMC) ఖజానాకు రక్షణగా ఉండాల్సిన అధికారులే *'అవినీతి తిమింగలాలు'*గా మారి ప్రభుత్వ ఆదాయానికి కన్నం వేస్తున్నారు. సరూర్ నగర్, ఎల్బీనగర్ జోన్లలో సామాన్యుడి చిన్నపాటి నిర్మాణాలపై డ్రోన్లతో నిఘా పెట్టి వేధించే అధికారులు, బడా వ్యాపారుల వద్దకు వచ్చేసరికి 'మామూళ్ల' మత్తులో జోగుతున్నారు. వేల చదరపు అడుగుల వాణిజ్య విస్తీర్ణాన్ని రికార్డుల్లో మాయం చేస్తూ, కమర్షియల్ భవనాలను రెసిడెన్షియల్‌గా చూపిస్తూ ఏటా ₹100 కోట్లకు పైగా గండి కొడుతున్నారు. ఉన్నతాధికారుల లాగిన్ల ద్వారానే అక్రమంగా పెనాల్టీలు మాఫీ చేస్తూ, నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. సాక్షాత్తూ సీఎం ఇలాకాలో జరుగుతున్న ఈ 'పన్ను'గడపై ఏసీబీ, విజిలెన్స్ ఎప్పుడు ఉక్కుపాదం మోపుతాయో వేచి చూడాలి.




- సరూర్ నగర్, ఎల్బీనగర్ జోన్లలో పన్నుల మాయాజాలం
- రికార్డుల్లో వేల చదరపు అడుగుల విస్తీర్ణం 'గాయబ్'
- సామాన్యుడిపై నోటీసుల ప్రతాపం.. బడా వ్యాపారుల వద్ద అధికారుల 'మామూళ్ల' మత్తు
- ఏటా వందల కోట్ల ఆదాయానికి గండి.. ఏసీబీ, విజిలెన్స్ నిమ్మకు నీరెత్తినట్లేనా?
- ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్ అవినీతికి పాల్పడిన డిప్యూటీ కమిషనర్లను వదిలేసి చిన్న స్థాయి ఉద్యోగులపై ఎందుకు ప్రతాపం చూస్తున్నారు.
- మున్సిపల్ శాఖ మాత్యులు సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి..

9లో

భారతశక్తి

# సరికొత్త ఆకాశవాణి

వ్యాసభారతాన్ని తెనుగు చేస్తూ తిక్కన చెప్పిన 'సారపు ధర్మమున్ విమల సత్యము...' అనే ఉద్యోగపర్వంలోని పద్యం పండితుల విశేష ప్రశంసలకు నోచుకుంది. 'అధర్మం చేతిలో ధర్మం, అసత్యం బలం ముందు సత్యం కృశిస్తున్న దుస్థితిని- సమర్థులు స్వయంగా పూనుకుని ఎదుర్కోకుంటే, సమాజం భ్రష్టుపడుతుంది. అది వారికి కూడా చేటు తెస్తుంది...' మూలభారతంలో ఉన్నది ఇంతవరకే. మరి నిస్సహాయుల సంగతి ఏమిటి? సమాజంలో అందరూ సమర్థులే ఉండరు కదా... అని ఆలోచించిన తిక్కన- ఆ భావాన్ని కొనసాగిస్తూ, దక్షులైనవారు ఉపేక్ష వహించినా, సత్యధర్మాలకు- దైవం రక్షణగా నిలుస్తాడని కృష్ణుడి నోట అభయం ఇప్పించాడు. అది బలహీనులకు భగవంతుడి భరోసా. తిక్కన కలిగించిన ఆశ. యుగధర్మాన్ని అనుసరిస్తూ, తిక్కన చేసిన ఈ జోడింపు, మార్పు- ఆ పద్యంలోని అఖండ ధర్మదీపం వత్తిని ఎగదోసింది. వెలుగులు పెంచింది. తిక్కన- అమాత్యుడు(మంత్రి) కాబట్టి సమాజహితాన్ని దృష్టిలో పెట్టుకుని మూలభారతాన్ని దాటి మరో అడుగు ముందుకు వేశాడు. ప్రతి యుగంలోనూ మనిషి పాటించాల్సిన ధర్మ సూక్ష్మాన్ని నిర్దేశించాడు.


ధర్మ అధర్మాలకు, సత్య అసత్యాలకు మధ్య ఘర్షణ ఏర్పడిన సందర్భాల్లో దైవం ఆకాశవాణి రూపంలో పరిష్కారం చూపిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. భరతుడు- శకుంతలకు దుష్యంతుడితో కలిగిన సంతానమే. అదే సత్యం. దాన్ని కాదన్నాడు దుష్యంతుడు. శంకించాడు శకుంతలను. 'ఆమె కందె డెందమున... ఆ ఇల్లాలి మనసు గాయపడింది' అన్నాడు నన్నయ. నిజానికి గాయమైంది- సత్యానికి. 'దివ్యవాణి వినిచె- వీడు నీకును శకుంతలకున్ ప్రియ నందనుండు, చేకొనుము' అని. సత్యానికి రక్షణ దొరికింది. సమస్య సమసిపోయింది. మృత్యుభీతి ఆవరించిన కంసుడు దేవకీదేవికి పుట్టిన పసికూనలను అడ్డంగా నరికేస్తున్నాడు. చివరికి యోగమాయ అడ్డుకుంది. 'నా సరసన్ జనించి నిన్ చంపెడి వీరుడొక్క దెస సత్కృతిన్ ఒందెదువాడు... మరోచోట క్షేమంగా గారాబంగా పెరుగుతున్నాడు' అంటూ కంసుడి భయాన్ని మరింతగా పెంచింది. చంపిన లేత దేహాల్లోంచే కంసుడి చావు జీవం పోసుకుందని హెచ్చరించింది. యోగమాయ ధైర్యం చెప్పింది దేవకికి కాదు- ధర్మానికి. భారత భాగవతాలను విశ్వసించే వారికి ఆకాశవాణి- ఒక సత్యం. కానివారికది- కల్పన!

ఈ ద్వంద్వాలు ప్రతియుగంలోనూ సర్వసహజం. ప్రతి పరిష్కారం అంచునా మరో సంక్షోభం వేలాడుతూనే ఉంటుంది. అద్దేపల్లి ప్రభు చెప్పినట్లు 'మనం ఎక్కడికీ పారిపోలేం.' పంజరాన్ని గుర్తించిన పావురమే- తన రెక్కల బలాన్ని గమనిస్తుంది. ఆశావాది విమానాన్ని కనుగొంటే- నిరాశావాది పారాచూట్‌ను ఊహిస్తాడు. ఇద్దరినీ కలుపుకొంటూ కాలం ముందుకు సాగిపోతూ ఉంటుంది. మధ్యమధ్యలో సందేహాలకు శంకలకు భయాలకు నివారణ కావాలంటే- మనిషి ధర్మాన్ని, సత్యాన్ని ఆశ్రయించాలి. 'జాబిల్లీ! నువ్వు సముద్రం మీద చేసే సంతకాన్ని గాలి చెరిపేయకుండా కాలమే కాపలా కాస్తుంది లే!' అన్నారు శ్రీశ్రీ. సత్యధర్మాలే జాబిల్లి వెలుగులు. సమర్థులు విస్మరించిన బాధ్యతను కాలం తన భుజాలకు ఎత్తుకుంటుంది. దిల్లీలో ఇటీవల జరిగిన కృత్రిమ మేధ(ఏఐ) ఇంపాక్ట్ సమిట్‌లో... ధర్మం అంటే ఏమిటి? మనిషికి అసలైన శత్రువు ఎవరు? సమస్యలను ఎదుర్కొనేదెలా.. వంటి ప్రేక్షకుల ప్రశ్నలకు- కృష్ణార్జునులు డిజిటల్ రూపాల్లో వచ్చి బదులిచ్చారు. సాంకేతికత రూపంలో కాలం జనానికి చేరువ అవుతోందంటున్నారు పరిశీలకులు. కాకపోతే, ఆ ధర్మలిపి ఆకాశవాణిలా సత్యంలో ముంచి రాసింది అవ్వాలంతే!

# నకిలీ వాహన బీమా రాకెట్ ముఠా అరెస్ట్

జీడిమెట్ల, భారత శక్తి ప్రతినిధి, మార్చి 01:

నకిలీ వాహన బీమా పాలసీలు తయారు చేసి ప్రజలను మోసం చేస్తున్న ముఠాను అరెస్టు చేశామని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపారు. ఈ కేసులో మొత్తం తొమ్మిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి మృణాల్ కుమార్ ఫిర్యాదు మేరకు, జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్ఎల్‌బి నగర్, పరిసర ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు ప్రముఖ బీమా సంస్థల పేర్లతో నకిలీ వాహన బీమా పత్రాలను తయారు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు ఫిర్యాదు ఆధారంగా జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సమాచారం ఆధారంగా ప్రత్యేక బృందంతో ఈ నెల 27వ తేదీన ఎన్ఎల్‌బి నగర్‌లో దాడులు నిర్వహించి రఘుల రవి, శివ కుమార్, ఎస్. కుర్తి మాణిక్యరావు, కొత్త బాబు రావు, రఘుల మహేష్, తడాకల గిరిధర్ గౌడ్, మోర నరసింహ, కుందుంగారి నాగరాజు, జెర్పుల కిషన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.



నిందితుల వద్ద నుంచి భారీగా నకిలీ వాహన బీమా పత్రాలు, స్టాంపులు, వాటి తయారీకి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అత్యవసరంగా బీమా రెన్యువల్ అవసరమైన వాహనదారులను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠా వ్యవస్థీకృతంగా పనిచేస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈ ముఠా తో సంబంధం అన్న ఇతరులను కూడా విచారించి అరెస్ట్ చేస్తామన్నారు. ఈ నకిలీ పాలసీల వల్ల ప్రజలు మోసపోవడమే కాకుండా ప్రమాదాల సమయంలో చట్టపరమైన, ఆర్థిక సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. వాహన బీమా తీసుకునే ముందు అధికారిక వెబ్‌సైట్లు లేదా కంపెనీ ఏజెంట్ల ద్వారా ధృవీకరణ చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

# 24 గంటల స్పీడ్ పోస్టు మరియు పార్సెల్ బుకింగ్ సౌకర్యాలు ప్రారంభం

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, మార్చి 01:

భారత తపాలా శాఖ ప్రజల సౌకర్యార్థం క్రింద తెలిపిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 11 ముఖ్య నగరాలలో 247 స్పీడ్ పోస్టు మరియు పార్సెల్ బుకింగ్ సౌకర్యాలను ప్రారంభించినట్లు తెలియజేస్తోంది.

1. విశాఖపట్నం2. విజయవాడ 3. గుంటూరు
4. నెల్లూరు 5. కర్నూలు
6. రాజమండ్రి 7. తిరుపతి 8. కడప
9. అనంతపురం 10. ఒంగోలు11. గుంతకల్

పైన పేర్కొన్న 11 నగరాలకే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర 242 ప్రధాన పట్టణ తపాలా కార్యాలయాలలో కూడా ప్రజల సౌకర్యార్థం సాధారణ పని వేళలను 1 నుండి 2 గంటల వరకు పొడిగించడం జరిగింది. దీని వల్ల కస్టమర్ల రద్దీ తగ్గి, సేవల నాణ్యత మరింత మెరుగుపడనుంది .

ప్రజలు మరియు వ్యాపార సంస్థలు, పై పేర్కొన్న 11 నగరాలలో అందుబాటులో ఉన్న 247 బుకింగ్ సౌకర్యాలను అలాగే ఇతర 242 తపాలా కార్యాలయాలలో పొడిగించిన పని వేళలను తమ సౌకర్యానుసారం వినియోగించుకోవాలని కోరడమైనది.

# పాంగ్రీలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 01 (భారత శక్తి) భైంసా మండలం, పాంగ్రీ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ వారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది.




కార్యక్రమానికి ఆహ్వానితులుగా హాజరైన ముఖ్య అతిథులు మాట్లాడుతూ, భారతదేశ చరిత్రలో ధైర్యసాహసాల ప్రతీకగా నిలిచిన మహానుభావుడు శివాజీ మహారాజ్ అని కొనియాడారు. స్వరాజ్య స్థాపన కోసం జీవితాన్ని అంకితం చేసి, ప్రజల్లో ఐక్యతా భావాన్ని పెంపొందించిన మహానేతగా ఆయన సేవలను స్మరించుకున్నారు. యువత శివాజీ మహారాజ్ గారి ఆదర్శాలను అనుసరించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం శాంతియుతంగా, విజయవంతంగా ముగిసింది.

# హోలీ వేడుకలు సురక్షితంగా జరుపుకోండి: భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 1 (భారత శక్తి):హోలీ పండుగను ప్రజలు సంతోషకర వాతావరణంలో, ప్రమాదాలకు దూరంగా ఉండి జరుపుకోవాలని రాజేష్ మీనా (ఐపీఎస్), భైంసా ఏఎస్పీ సూచించారు. హోలీ వేడుకల సందర్భంగా రహదారులపై క్రమశిక్షణ పాటించాలని, రంగులు చల్లుకునే సమయంలో పరిసరాలను గమనించాలని ఆయన కోరారు. రంగులు ఇష్టపడని వ్యక్తులపై బలవంతంగా రంగులు చల్లరాదని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, మద్యం మత్తులో వాహనాలు నడపరాదని హెచ్చరించారు.



ఉత్సవం విషాదంగా మారకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

రసాయన రంగులు ఆరోగ్యానికి హానికరమని, సంప్రదాయ రంగులను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. నివాస గృహాలు, ప్రార్థనా మందిరాలపై రంగులు చల్లకూడదన్నారు. పండుగ అనంతరం ఎవరూ లోతైన నీటిలోకి లేదా నీటి ప్రవాహం ఉన్న కాల్వల్లోకి ఈతకు వెళ్లరాదని హెచ్చరించారు. తొందరపాటు, అత్యుత్సాహం ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మహిళలను గౌరవించాలని, ఇతరులకు ఇబ్బంది కలగకుండా ప్రవర్తించాలని కోరారు. పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

వీధులు, బహిరంగ ప్రదేశాల్లో గుంపులుగా ద్విచక్ర వాహనాలు మరియు ఇతర వాహనాలతో తిరగడం నిషేధమని తెలిపారు. ఇటువంటి చర్యలు శాంతిభద్రతలకు భంగం కలిగించవచ్చని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, గుంపులుగా చేరడం, సభలు, సమావేశాలు, ఊరేగింపులపై నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయని గుర్తుచేశారు. పోలీసుల సూచనలు, నియమాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు.

# ఎంజేపీ గురుకులంలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

## విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానం అవసరం ప్రిన్సిపాల్ స్రవంతి

పఠాన్ చెరు, మార్చి 01(భారత శక్తి): పఠాన్ చెరు మండలంలోని చిన్న కంజర్ల గ్రామంలో గల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా






గురుకుల ప్రిన్సిపాల్ బి. స్రవంతి మాట్లాడుతూ..విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక,పరిజ్ఞానం,వైపు దృష్టిని సాదించాలని సూచించారు. సమాజంలో వస్తున్నా ఆధునిక , సాంకేతిక మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడూ విద్యార్థులు చదువుతో శాస్త్రీయ విజ్ఞానం పట్ల అవగాహన పెంచుకోవాలని, ప్రయోగశాలలు ప్రజలకు ఉపయోపడే విధంగా ఉండాలని అన్నారు.1928లో భారత భౌతిక శాస్త్రవేత్త సి.వి రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్నిజరుపుకుంటామని తెలియజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ సంబందిత అంశాల పై పోటీలను నిర్వహించి బహుమతులను విద్యార్థులకు అందచేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దశరథ్ అనిల్,అఫ్రీాన్ అపర్ణ శ్రీ లక్ష్మి మహేష్ సురేష్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ

తిరుమల, 2026 మార్చి 01:: శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్రతో కలిసి ఆవిష్కరించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం టిటిడి ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ పంచాంగాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి అనుగ్రహంతో శ్రీ పరాభవ నామ సంవత్సరంలో మనందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సకల ఐశ్వర్యాలు సమకూరాలని ఆకాంక్షిస్తున్నాట్లు చెప్పారు.

# జనసేన 'ఉద్యమి' సభ్యత్వ కార్యక్రమం ప్రారంభం కార్యకర్తలకు భరోసా

పోరుమామిళ్ళ, భారతశక్తి ప్రతినిధి, మార్చి 01: జనసేన పార్టీ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి గాను సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని 'ఉద్యమి' పేరుతో ప్రారంభించారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా కార్యకర్తలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

'ఉద్యమి' సభ్యత్వం తీసుకున్న వారికి భద్రతా భరోసాగా ఆర్థిక సహాయం అందించనున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి:

సహజ మరణం సంభవిస్తే ? రూ.1,00,000,అనుకోని ప్రమాదంలో మరణిస్తే ? రూ.5,00,000

ప్రమాదంలో గాయపడితే ? రూ.50,000,పూర్తిగా వైకల్యం కలిగితే ? రూ.2,00,000.పార్టీ సభ్యత్వం తీసుకోవాలనుకునే వారు ఆధార్ కార్డు,పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో,నామిని ఆధార్,సభ్యత్వ రుసుము రూ.400

శాశ్వత ఫోన్ నంబర్, ఇవన్నీ సమర్పించవలెను.ఈ సభ్యత్వ కార్యక్రమంపై ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత నాయకులను



సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.పోరుమామిళ్ల మండల జనసేన అధ్యక్షుడు శీలంశెట్టి లక్ష్మయ్య

ఫోన్: 7075438072, 82470 26497,91 94946 88475,91 95731 19468,91 80745 96356,82470 26497,9741331526 నంబర్లలో సంప్రదించండి.

భారత శక్తి



# లోన్ యాప్ ఏజెంట్ల వేధింపులు యువకుడి ఆత్మహత్య

మేడ్చల్ మార్చి 1

లోన్ యాప్ ఏజెంట్ల వేధింపులు తట్టుకోలేక ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ జిల్లా ఘట్కేసర్లో జరిగింది.

పోలీసుల వివరాల ప్రకారం, ఘట్కేసర్కు చెందిన పర్ధాన్ సాయికుమార్ (35)కి ఏడాది క్రితం వివాహం జరిగింది. దంపతులకు ఒక పాప ఉంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా భార్య పేరుమీద లోన్ యాప్ ద్వారా రుణం తీసుకున్నట్లు తెలిసింది. అయితే సకాలంలో రుణం చెల్లించలేకపోవడంతో యాప్ ఏజెంట్లు ఫోన్ కాల్స్, సందేశాల ద్వారా వేధింపులకు దిగినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. లోన్ యాప్ ఏజెంట్లు భార్య ఫోటోలు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తామని బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తుంది.

తీవ్ర మనస్థాపానికి గురైన సాయికుమార్, ఘట్ కేసర్ కొండాపూర్ లోని ఒక ప్రైవేట్ వెంచర్ ప్రాంతంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళా సర్పంచ్ ను బంధించిన కూటమి నేతలు

అనకాపల్లి మార్చి 1

అనకాపల్లిలో కూటమి నేతల విభేదాలు రచ్చకెక్కాయి. టీడీపీ నేతలు ఒక బీజేపీ బీసీ మహిళా సర్పంచ్ ను కాసేపు బంధించారు. అచ్యుతాపురం మండలం నునపర్తి గ్రామంలో ఘటన జరిగింది. అధికారులు శుక్రవారం రాత్రి నూనపర్తి గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. తాము వ్యతిరేకించే అంశాలకు ఎలా ఆమోదం తెలుపుతారని టీడీపీ నేతలు సర్పంచ్ పై దాడికి యత్నించారు. సమావేశం రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని పట్టు పట్టారు. కుదరదని చెప్పిన సర్పంచ్ అనురాధ సహా సెక్రటరీ మధును బంధించారు. రాత్రి 10 గంటలు అవుతున్నా బీసీ మహిళా సర్పంచ్ ను విడిచిపెట్టలేదు. తరువాత వదిలిపెట్టారు.

# విశాఖ పార్టీ కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ 82వ రోజు ప్రజాదర్బార్

## ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరణ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ

విశాఖపట్నంమార్చి 1

అనకాపల్లి జిల్లాలో బ్లూ జెట్ పరిశ్రమ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖపట్నం చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. నేడు ఉదయం విశాఖ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 82వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి వేతన స్కేళ్లను వర్తింపజేయాలని అనకాపల్లి జిల్లాకు చెందిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఫార్మసీలో మాస్టర్స్ చేసిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని విశాఖకు చెందిన ఏ.యామిని కోరారు. అనకాపల్లి జిల్లా సీతపాలెం గ్రామ భూ నిర్వాసితుల పునరావాసం, నష్టపరిహారం, సైట్ కేటాయింపుతో పాటు స్థానికులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి లక్ష్మీదేవిపేటలోని శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఆలయ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని శ్రీ కనకదుర్గమ్మ ప్రార్థన సొసైటీ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి కోరారు. ఇటీవల ప్రతిపాదిత ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా పవిత్ర ఆలయానికి భంగం కలగకుండా చూడాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పర్వాడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పీల దిలీప్ కుమార్ తమ ఇంటిని అక్రమంగా స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని అనకాపల్లికి చెందిన పి.సతీష్ కుమార్ మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

# ఆప్ నేతల సంబరాలు

హైదరాబాద్ మార్చి 1

మద్యం కేసులో కేజీవాల్, మనీశ్ సిసోడియా సహా 23 మందికి క్లీన్చిట్ ఇస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై తెలంగాణ ఆమ్ ఆద్మీ పార్టీ హైదరాబాద్ లో సంబరాలు జరుపుకుంది. లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయం ముందు పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జీల్లోజి, సీనియర్ నాయకుడు డాక్టర్ దిడ్డీ సుధాకర్ తదితరులు పాల్గొని బాణాసంచాలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా డప్పు చప్పులకు నృత్యాలు చేశారు. అధికారం కోసం ప్రధాని మోదీ, అమిత్ షాలు ఈ కుట్ర పన్నారని మద్యం విధానంపై తప్పుడు కేసు నమోదు చేసి, పార్టీని లేకుండా చేయాలని చూశారని హేమ, సుధాకర్ ఆరోపించారు. సిబిఐ నమోదు చేసిన అక్రమ కేసులో క్లిన్ చిట్ ఇస్తూ న్యాయస్థానం చారిత్రక తీర్పు ఇవ్వడంపై ఆనందంగా వ్యక్తం చేశారు.

# కేబీఆర్ పార్క్ చుట్టూ 7 ఫ్లైఓవర్లు,

హైదరాబాద్, మార్చి 1

హైదరాబాద్లో సిగ్నల్ ఫ్రీ జంక్షన్లు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని సీపీ సజ్జనార్ వెల్లడించారు. హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కేబీఆర్ పార్కు వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్లు, అండర్ పాస్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. కేబీఆర్ పార్కు చుట్టూ రానున్న 2 ఏళ్లలో 7 ఫ్లైఓవర్లు, 7 అండర్పాస్లు అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. ట్రాఫిక్కు అంతరాయం లేకుండా రాత్రివేళల్లో పనులు కొనసాగుతాయని తేల్చి చెప్పారు. విశ్వ నగరంగా మారిన హైదరాబాద్లో ట్రాఫిక్ను ఎప్పటికప్పుడు సమర్థవంతంగా నియంత్రించేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత 12 ఏళ్లలో హైదరాబాద్ నగరంలో ఎన్నో ఫ్లైఓవర్లు, అండర్ పాస్లు, స్టీల్ బ్రిడ్జిలను నిర్మించారు. దీంతో రోజురోజుకూ పెరుగుతున్న నగర జనాభాకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పీక్ అవర్స్లో గంటల తరబడి ట్రాఫిక్లో వేచిచూడాల్సిన దుస్థితి నగరవాసులకు కలుగుతోంది. అయితే వాటిని కూడా తప్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. భవిష్యత్లో పెరగనున్న ట్రాఫిక్ను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు తీసుకుంటోంది.నగరంలో రానున్న రోజుల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని.. ప్రభుత్వం చేపట్టిన హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్ఫార్మేటివ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ) ప్రాజెక్ట్ పనులు జోరందుకున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2 లోని ముగ్ధ జంక్షన్ వద్ద నిర్మిస్తున్న స్టీల్ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ శుక్రవారం పరిశీలించారు. జీహెచ్ఎంసీ, మేఘా ఇంజినీరింగ్ ప్రతినిధులు, పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి సజ్జనార్ ఆ ప్రాంతాన్ని పర్యవేక్షించారు. హైదరాబాద్లో ట్రాఫిక్ సిగ్నల్స్ లేని రోడ్ల వ్యవస్థను తీసుకురావడమే లక్ష్యంగా ఈ ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నట్లు సజ్జనార్ వెల్లడించారు. మరీ ముఖ్యంగా కేబీఆర్ పార్కు చుట్టూ సిగ్నల్ ఫ్రీ జర్నీ కోసం రానున్న 2 ఏళ్లలో మొత్తం 7 ఫ్లై ఓవర్లు, 7 అండర్ పాస్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, జీహెచ్ఎంసీ, పోలీసు అధికారుల సమన్వయంతో నగరవాసులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ ఫ్లై ఓవర్, అండర్ పాస్లను దశలవారీగా నిర్మించనున్నట్లు వివరించారు. శుక్రవారం రాత్రి నుంచే ముగ్ధ జంక్షన్ నుంచి కేబీఆర్ పార్కు వైపు మార్గంలో 6 పిల్లర్ల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అయితే రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పగలు ట్రాఫిక్కు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా కేవలం.. రాత్రి పూటే ముమ్మరంగా పనులు కొనసాగుతాయని సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ పిల్లర్ల పునాదులు పూర్తి అయ్యే వరకు మాత్రం వాహనదారులకు ఇబ్బంది ఉంటుందని తెలిపారు. ఆ తర్వాత యథావిధిగా వాహనాల రాకపోకలు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక హెచ్ సిటీ ప్రాజెక్ట్ పూర్తి అయితే కేబీఆర్ పార్క్ ప్రాంతంలో పూర్తిగా సిగ్నల్ ఫ్రీ జంక్షన్ అందుబాటులోకి వస్తుందని వివరించారు. దీంతో హైదరాబాద్ నగరంలోని సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ ప్రాంతాలకు వేగంగా, సాఫీగా ప్రయాణించే అవకాశం ఉంటుందని తెలిపారు. అయితే ఈ నిర్మాణ పనుల కారణంగా ఆయా మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు తప్పవని సజ్జనార్ తెలిపారు. ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో పెట్టుకుని వాహనదారులు తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని హితవు పలికారు. రద్దీ నివారణకు ప్రజా రవాణాను ఉపయోగించుకోవాలని సూచించారు. పనులు ప్రారంభమైన తర్వాత ట్రాఫిక్ అడ్వైజరీ జారీ చేస్తామని తెలిపారు. నగర అభివృద్ధి కోసం చేపట్టే ఈ నిర్మాణ పనులకు నగరవాసులు అధికారులకు సహకరించాలని సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# నలందా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ 45 ఏళ్ల వైభవోత్సవ వేడుకలు

హైదరాబాద్:మార్చి 1

నలందా ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ తమ 45వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంది. నాలుగు దశాబ్దాలకుపైగా విద్యా ప్రావీణ్యం, క్రమశిక్షణ మరియు సమగ్ర విద్యార్థి అభివృద్ధికి అంకితభావంతో సేవలందిస్తూ వస్తున్న ఈ సంస్థ, తన విశిష్ట ప్రయాణాన్ని గర్వంగా ఆచరించింది. 1980లో మంతెన సూర్యనారాయణ రాజు ఆధ్వర్యంలో స్థాపించబడిన నాలందా ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్, శాశ్వత గుర్తింపుతో తన విద్యా సేవలను ప్రారంభించింది. విలువల ఆధారిత విద్యను లక్ష్యంగా చేసుకొని ప్రారంభమైన ఈ సంస్థ, నేడు సమాజానికి బాధ్యతాయుతమైన, ప్రతిభావంతులైన పౌరులను తీర్చిదిద్దే ప్రముఖ విద్యాసంస్థగా ఎదిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా భారత విదేశాంగ సేవల మాజీ అధికారి మరియు ప్రముఖ దౌత్యవేత్త దీపక్ వోహ్రా, , ఐక్యరాజ్యసమితితో అనుబంధం కలిగిన గ్లోబల్ వ్యూహకర్త మరియు దౌత్య నాయకురాలు సునీత వర్మ,, భారత సైన్యానికి చెందిన మేజర్ రామ్ విచ్చేసి విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ శ్రీనివాస రాజా మంతెన గామరియు డైరెక్టర్ సూర్య మంతెన నాయకత్వం వహించారు. వారు సంస్థ యొక్క లక్ష్యం అయిన సమగ్ర వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు మరియు ప్రపంచ స్థాయి దృష్టితో విద్యార్థులను తీర్చిదిద్దే కట్టుబాటును పునరుద్ఘాటించారు. విద్యా జ్యోతి ప్రదీపంతో కార్యక్రమం ప్రారంభమై, 45 ఏళ్ల జ్ఞానయాత్రకు ప్రతీకగా నిలిచింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం మరియు క్రమశిక్షణను ప్రతిబింబించాయి. ముఖ్య అతిథులు తమ ప్రసంగాల్లో నాలందా యొక్క విశిష్ట ప్రయాణాన్ని ప్రశంసిస్తూ, నైతిక నాయకత్వం, అంతర్జాతీయ అవగాహన మరియు నాణ్యమైన విద్య ద్వారా దేశ నిర్మాణం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. 46వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నలందా ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్, సృజనాత్మకత, విలువల ఆధారిత విద్య మరియు భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేసే శిక్షణతో ముందుకు సాగాలని సంకల్పించింది.

# అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలో బ్లూ జెట్ హెల్త్ కేర్ యూనిట్ కు మంత్రి లోకేష్ శంకుస్థాపన

## రూ.2,300 కోట్ల పెట్టుబడి, 1,750 మందికి ఉద్యోగాలు కల్పించనున్న బ్లూ జెట్

అనకాపల్లి: మార్చి 1

కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఉత్తరాంధ్రలో మరో భారీ ఔషధ తయారీ పరిశ్రమకు అంకురార్పణ జరిగింది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలోని సీతపాలెం వద్ద ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్) లో ప్రముఖ ఫార్మా కంపెనీ బ్లూ జెట్ హెల్త్ కేర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఏర్పాటుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ముందుగా రాంబిల్లి మండలంలోని సీతపాలెం ఇండస్ట్రియల్ పార్క్ కు చేరుకున్న మంత్రి లోకేష్ కు కంపెనీ ప్రతినిధులు, కూటమి నేతలు మంగళవాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం బ్లూ జెట్ హెల్త్ కేర్ పరిశ్రమకు మంత్రి లోకేష్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. రాంబిల్లి మండలం ఇండస్ట్రియల్ పార్క్ లో బ్లూ జెట్ పరిశ్రమ ఫార్మాస్యూటికల్ ఇంటర్మీడియట్లు, కాంట్రాక్ట్ డెవలప్ మెంట్ తయారీ యూనిట్ ను ఏర్పాటుచేయనుంది. ఇందుకు రూ. 2,300 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 1,750 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ప్రత్యేక ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన బ్లూజెట్ పరిశ్రమకు కూటమి ప్రభుత్వం 102.48 ఎకరాలను కేటాయించింది. మూడు దశల్లో ఫార్మా కంపెనీని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర, అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేష్, బీయలమంచిలి నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఏపీఆర్డీసీ ఛైర్మన్ పి.నాగేశ్వరరావు, బ్లూ జెట్ హెల్త్కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఛైర్మన్ అక్షయ్ బన్సారీలాల్ అరోరా, మేనేజింగ్ డైరెక్టర్ శివెన్ అరోరా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వేణుబాబు, సహ వ్యవస్థాపకులు ఉ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరేష్ షా, కలెక్టర్ విజయ కృష్ణన్, బ్లూ జెట్ హెల్త్కేర్ బృంద సభ్యులు, ప్రజా ప్రతినిధులు, ఏపీఐఐసీ, వివిధ శాఖల సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ×××

# వికారాబాద్లో మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఆత్మహత్య

వికారాబాద్ మార్చి 1

వికారాబాద్ పట్టణంలో విషాద ఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని టౌన్ గంగారం సాయి బాబా కాలనీలో నివాసం ఉంటున్న ఓ మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సీఐ రఘుకుమార్ మాట్లాడుతూ మృతురాలు సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ధరూర్ పోలీస్ స్టేషన్లో రైటర్ గా పనిచేస్తున్న దివ్య సూసైడ్ లెటర్లో “నా చావుకు ఎవరు కారణం కాదు. నాన్న లేకపోవడం వల్లే మనకు ఇన్ని బాధలు” అని పేర్కొన్నట్లు సీఐ వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యతో కుటుంబ సభ్యులు, సహచరులు మరియు కాలనీ వాసులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

==========================

# రెండు ఆర్టీసీ బస్సులు, ఒక ప్రైవేటు బస్సు ఢీ. పలువురికి గాయాలు

సంగారెడ్డి మార్చి 1

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు రుద్రారం వద్ద ముంబై జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం జరిగింది. వరుసగా రెండు ఆర్టీసీ బస్సులు, ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్నాయి. రుద్రారం బస్టాప్ వద్ద ప్రయాణికులను ఎక్కిస్తుండగా ప్రమాదం జరిగింది. బస్సులను వెనుక నుంచి మరో కారు ఢీకొన్నది. కర్ణాటక, సంగారెడ్డి డిపోలకు చెందిన బస్సులు ప్రమాదంలో చిక్కుకున్నాయి. ప్రమాదంలో ఆరు మందికి తీవ్ర గాయాలు, 10 మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని 108 అంబులెన్స్లో స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

==========================

# సత్తెనపల్లిలో పెన్షన్ల పంపిణీ

పల్నాడు.. మార్చి 1

సత్తెనపల్లిలోని 18వార్డులో ఎన్టీఆర్ భరోసా ఫించన్లు పంపిణీ జరిగింది. ఒకరోజు ముందుగానే పింఛన్లు కూటమి ప్రభుత్వం పంపిణీ చేసింది. కూటమి నేతలు ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు ఫించన్లు పంపిణీ చేసారు. పెంక్షన్లు పంపిణీ లో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దరువూరి నాగేశ్వరరావు ,కార్యకర్తలు..కూటమి నేతలు పాల్గోన్నారు.

=====================

# జనసేన పార్టీ కార్యాలయం భద్రత వైఫల్యం పోలీసులపై వేటు

గుంటూరు మార్చి 1

జనసేన పార్టీ కార్యాలయం భద్రత వైఫల్యంపై అధికారులు నివేదిక అందించారు. శ్రీకాకుళంకు చెందిన నీలాద్రి పార్టీ కార్యాలయంలో చొరబడి రెండు కార్లు ధ్వంసం చేసిన ఘటనలో ఐదుగురిని హెడ్ క్వార్టర్ కి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. రిజర్వ్ ఇన్స్పెక్టర్ పెంటరావు నలుగురు కానిస్టేబుల్స్ పై చర్యలు తీసుకుంటాని సమాచారం. మంగళగిరి పోలీస్ స్టేషన్లో పోలీసు అధికారులు విచారణ చేస్తున్నారు.

# చెట్టును ఢీకొట్టిని స్కూల్ బస్సు? విద్యార్థులకు గాయాలు

రాజోలు మార్చి 1

సఖినేటిపల్లి మండలం రాంబాగ్ దగ్గర శ్రీ చైతన్య స్కూల్ బస్సు చెట్టుకు ఢీ కొట్టింది. ఘటనలో విద్యార్థులకు గాయాలు అయ్యాయి. ఘటన సమయంలో బస్సులో ఎనిమిది మంది విద్యార్థులు వున్నారు. స్థానికుల సహాయంతో వారిని హాస్పటల్ కు తరలించారు. బస్సు బలంగా ఢీ కొట్టిన వేగానికి కొబ్బరి చెట్టు పూర్తిగా పడిపోయింది. గొంది నుంచి అంతర్వేది రాంబాగ్ వస్తుండగా డ్రైవింగ్ క్లీనర్ కి ఇవ్వటం తో ప్రమాదం జరిగింది.

==========================

# హెచ్పివి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు

చిపూరుపల్లి మార్చి 1

రాష్ట్ర వ్యాప్తంగా హెచ్పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు శనివారం చీపురుపల్లి నుంచి ప్రారంభించారు. విజయనగరం జిల్లా, చీపురుపల్లి చేరుకున్న ముఖ్యమంత్రికి మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు, అధికారులు స్వాగతం పలికారు. తరువాత అయన కమ్యూనిటీ హెల్త్ సెంటర్కు వెళ్లారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో విద్యార్థినులతో ముచ్చటించారుస

వ్యాక్సినేషన్ వల్ల క్యాన్సర్ బారిన పడకుండా ఉంటారని విద్యార్థినులకు వివరించి చెప్పారు. సీఎం సమక్షంలో 14 ఏళ్ల లోపు విద్యార్థినులకు ఏఎన్ఎమ్లు వ్యాక్సిన్ వేసారు. హెచ్పీవీ వల్ల ఉపయోగాల గురించి విద్యార్థినులను సీఎం చంద్రబాబు తెలియచెప్పారు. క్యాన్సర్ రాకుండా రక్షణ కోసం ఈ వ్యాక్సినేషన్ ఇస్తున్నామని అన్నారు.

సంజీవని కార్యక్రమంలో భాగంగా డిజిటల్ హెల్త్ రికార్డుల్లోనూ వ్యాక్సినేషన్ డేటా ఉంచాలి. ఆసుపత్రి ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సీఎం ఆదేశాలు ఇచ్చారు.

ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులు ఉండాలి. ఆసుపత్రికి అడ్వైజరీ కమిటీని కూడా నియమించాలని సూచించారు

# అనకాపల్లిలో మంత్రి లోకేష్ పర్యటన

అనకాపల్లిఅనకాపల్లి జిల్లాలో మంత్రి నారా లోకేశ్ పర్యటించారు. బ్లూజెట్ హెల్త్కేర్ యూనిట్కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. రాంబిల్లి మండలంలోని ఇండస్ట్రియల్ పార్క్లో యూనిట్ ఏర్పాటు చేస్తున్నారు. బ్లూజెట్ హెల్త్కేర్ లిమిటెడ్ యూనిట్కు శంకుస్థాపన చేయనున్న లోకేశ్ అక్కడి పెట్టు బడిదారులతో మాట్లాడనున్నారు. సుమారు 2,300 కోట్ల రూపాయల పెట్టుబడితో దశల వారీగా బ్లూజె ట్ హెల్త్కేర్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. 2028-29 ఆర్థిక ఏడాదిలో బ్లూజెట్ హెల్త్కేర్ కార్య కలాపాలు ప్రారంభంకాను న్నాయి. ఈ సంస్థ ఏర్పాటుతో 1,750 మందికి ప్రత్యక్ష ఉద్యోగాల కల్పన ఉంటుందని అధికారులు తెలిపా రు.

# హోలీ ఉత్సవం జరుపుకునే వారు ప్రమాదాలకు దూరంగా ఉండాలి

## -ఇతరులను ఇబ్బందులకు గురిచేయవద్దు.
## -ఇష్టపడని వారిపై రంగులు చల్లోద్దు
## -సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ



సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి01:

హోలీ పండుగ సందర్భంగా ఉత్సవం జరుపుకునే వారు ప్రమాదాలకు దూరంగా ఉంటూ సంతోషకర వాతావరణంలో కలిసిమెలిసి జరుపుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. రహదారులపై క్రమశిక్షణతో ఉండాలి అని కోరారు. రంగులు చల్లుకునే సమయంలో పరిసరాలను గమనించాలని కోరారు. రంగులు ఇష్టపడని వ్యక్తులపై బలవంతంగా రంగులు చల్లవద్దు అని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దు, మద్యం మత్తులో వాహనాలు నడకకూడద కోరారు. ఉత్సవం విషాదం కాకూడదు అని అన్నారు.

రసాయన రంగులు ఉపయోగిస్తే అనారోగ్యం కలిగే అవకాశం ఉన్నది, కావున సంప్రదాయ రంగులతో హోలీ జరుపుకోవాలని కోరారు. నివాసాలపై, ప్రార్థనా మందిరాలపై రంగులు చల్లకూడదు.పండుగ అంతరం ఎవరుకుడా లోతైన నీటిలోకి, నీటి ప్రవాహం ఉన్న కాల్వలోకి ఈతలకు వెళ్ళకూడదు. తొందరపాటు, అత్యుత్సాంతో ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలి. ఇతరులను, మహిళలను గౌరవించాలి అన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

వీధుల్లో బహిరంగ ప్రదేశాలలో గుంపుగా ద్విచక్ర వాహనాలు మరియు ఇతర వాహనాల కదలికలను నిషేధం గలదు. ఇవి శాంతిభద్రతలకు విఘాతం లేదా ప్రజలకు అసౌకర్యం కలిగిస్తాయి.జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నది, గుంపులుగా చేరడం, సభలు, సమావేశాలు, ఊరేగింపులపై నిషేధాజ్ఞలు ఉన్నాయి అని ఎస్పి గుర్తు చేశారు.పోలీసు సూచనలు, నియమాల ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు.

# భైంసాలో ఆరాధన ఆసుపత్రి నూతన భవనం ఘనంగా ప్రారంభం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 01 (భారత శక్తి): ఆరాధన ఆసుపత్రి నూతన భవనం ప్రారంభోత్సవం భైంసా నగరంలోని గోకుల్ నగర్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముధోల్ తాలూకా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై భవనాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ బైంసా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను మానవతా దృక్పథంతో అందించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్యం అందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

ఆరాధన ఆసుపత్రి వ్యవస్థాపకులు డా". రాజారెడ్డి కృషి అభినందనీయమని, ఆయన వైద్య సేవలు సమాజానికి చిరస్మరణీయమని కొనియాడారు.కార్యక్రమంలో భైంసా మున్సిపాలిటీ చైర్మన్ తముల దత్త్రాత్రి. మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మరియు ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ భోంస్లే నారాయణరావు పటేల్, పటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు, మున్సిపల్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖ వైద్యులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అతిథులు ఆసుపత్రిలోని వివిధ వార్డులను ప్రారంభించి, ఆధునిక వైద్య సదుపాయాలను పరిశీలించారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆరాధన



ఆసుపత్రి ముందుండాలని ఆకాంక్షించారు.

ఆసుపత్రి నిర్వహణాధికారులు డాక్టర్ జి. రాజా రెడ్డి, తిరుపతి రెడ్డి, ఎం. శేఖర్ రెడ్డి, డాక్టర్ ఎం. శ్రీజా రెడ్డి (ఓఆ రేడియాలజీ), డాక్టర్ ఎం. షౌనక్ రెడ్డి (ఓఃబా), డాక్టర్ నిరూప్ రెడ్డి (ఓఃబా, ఓఆ పీడియాట్రిక్స్), డాక్టర్ స్నేహ రెడ్డి (ఓఃబా, ఓూ), డాక్టర్ జి. రిచెత్ రెడ్డి (ఓఃబా), డాక్టర్ జి. రాజీవ్ రెడ్డి (ఓఃబా) తదితరులు అతిథులను శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

# బౌద్ధ దమ్మ ప్రపంచశాంతి పాదయాత్రకు సంఘీభావం తెలిపిన ధర్మార్జున్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి01:

ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ కర్ణాటక రాష్ట్రం సిద్ధార్థ్ విహార్ నుండి ప్రారంభమైన బౌద్ధ దమ్మ శాంతియాత్ర ఈరోజు నాగార్జునసాగర్ కు చేరుకుంటున్న సందర్భంగా పెదవుర మండల కేంద్రంలో యాత్రలో పాల్గొని బౌద్ధం గురువులకు తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ స్వాగతం పలికి యాత్రకు సంఘీభావం తెలియజేశారు భారత దేశంలో పుట్టి నడయాడిన బౌద్ధం ప్రపంచవ్యాప్తంగా శాంతిని బోధిస్తూ విరాజిల్లుతున్నదని ధర్మార్జున్ అన్నారు ప్రపంచంలోని థాయిలాండ్ బౌద్ధ గురువులు ఈ యాత్రలో పాల్గొంటున్నారు ఈ సందర్భంగా ధర్మార్జును మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఒకవైపు యుద్ధ మేఘాలు అలుముకున్న పరిస్థితి లో భారతదేశంలో మతోన్మాద , సామాజిక అసమానతలు, దాడులు కొనసాగుతున్న ఈ సందర్భంగా ఈ యాత్ర నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ వనం స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య సమన్వయం లో సాగుతోంది. తెలంగాణ ప్రాంత బౌద్ధ నాయకులు పాల్గొంటున్నారు. ఈరోజు యాత్రలో తెలంగాణ విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్ గౌడ్,



ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సుమన్ నాయక్, ప్రవీణ్, నల్గొండ జిల్లా నాయకులు వీరు ,చందర్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లా: ఆన్-సైట్ ఎఫ్ఐఆర్ ద్వారా బాధితుడికి తక్షణ న్యాయం.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 01 (భారత శక్తి) నిర్మల్ ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ఆదేశాల మేరకు చేపట్టిన ప్రజాభద్రత చర్యల్లో భాగంగా, పోలీస్ స్టేషన్‌కు రాలేని బాధితులకు సత్వర న్యాయం అందించే ఉద్దేశంతో డిజిపి ప్రారంభించిన ఆన్-సైట్ ఎఫ్ఐఆర్ విధానాన్ని పోలీసులు సమర్థంగా అమలు చేస్తున్నారు.

ఈ క్రమంలో, ఫిబ్రవరి 25 సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో శివాజీ నగర్ లో ఉండే షిండే హనుమంతరావు (55), తన గ్లామర్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా శివాజీ కమాన్ వద్ద యూ-టర్న్ తీసుకుంటున్న సమయంలో నిర్మల్ వైపు నుంచి వేగంగా, అజాగ్రత్తగా వచ్చిన ఒక కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన కిందపడిపోగా తలకు మరియు భుజాలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం ఆయనను ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.


గాయాల కారణంగా పోలీస్ స్టేషన్‌కు స్వయంగా హాజరుకాలేని పరిస్థితి నెలకొనడంతో, బాధితుడి అభ్యర్థన మేరకు భైంసా టౌన్ పోలీసులు ఆసుపత్రికి వెళ్లి ఆయన వద్ద నుంచే పిటిషన్ స్వీకరించి, సంఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి కాపీని బాధితుడికి అందజేశారు.




ప్రజలకు భరోసా కల్పించే దిశగా పోలీసులు చేపట్టిన ఈ ఆన్-సైట్ ఎఫ్ఐఆర్ చర్యపై స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

# ఆర్జీయూకేటీ - మ్యాట్‌విజ్ ఇంజన్యుటి మధ్య అవగాహన ఒప్పందం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 01 (భారత శక్తి) రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం




(ఆర్జీయూకేటీ) మెటలర్జీ ఇంజనీరింగ్ విభాగం, హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న మ్యాట్‌విజ్ ఇంజన్యుటి ప్రైవేట్ లిమిటెడ్ మధ్య చారిత్రాత్మక ఒప్పందం కుదిరింది. వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎ. గోవర్ధన్ సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఒప్పంద పత్రాలపై సంతకాలు

ఈ భాగస్వామ్య పత్రాలపై విశ్వవిద్యాలయ ఓయస్డి, పరిపాలన అధికారి ఆచార్య ఇ. మురళీధర్, మ్యాట్‌విజ్ ఇంజన్యుటి సహ వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యనిర్వహణ అధికారి జె. విష్ణుజిత్ రాథోడ్ సంతకాలు చేసి పత్రాలను మార్చుకున్నారు.

భాగస్వామ్య లక్ష్యాలు

మెటలర్జీ, మెటీరియల్స్ ఇంజనీరింగ్ రంగాలలో పరిశోధనలు ముమ్మరం చేయడం, నూతన సాంకేతిక ఆవిష్కరణలకు ఊతమివ్వడం ఈ ఒప్పంద ప్రధాన ఉద్దేశ్యం. విద్యార్థులకు క్షేత్రస్థాయిలో నైపుణ్య శిక్షణ కల్పించడంలో ఇరు సంస్థలు సమన్వయంతో పనిచేస్తాయి.

మెటలర్జీ విభాగం ప్రత్యేకతలు - విభాగాధిపతి వివరణ

మెటలర్జీ విభాగాధిపతి కిరణ్ కుమార్ అత్యం ఈ సందర్భంగా కీలక అంశాలను వెల్లడించారు:

విశిష్టత: దేశంలో అతి కొద్ది సంస్థల్లో మాత్రమే ఉన్న మెటలర్జీ విభాగం ఇక్కడ ఉండటం గర్వకారణం.

ఉపాధి: నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలతో పాటు 'మేక్ ఇన్ ఇండియా' పథకం ద్వారా విద్యార్థులకు అపారమైన అవకాశాలు లభిస్తున్నాయి.

కృత్రిమ మేధ: భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు కృత్రిమ మేధలో ప్రత్యేక శిక్షణ అందించి వారిని నిపుణులుగా తీర్చిదిద్దుతాం.

పాల్గొన్న ప్రముఖులు

ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్లు డాక్టర్ ఎస్. విఠల్, శీలం శేఖర్, డాక్టర్ కె. మహేశ్, వివిధ విభాగాధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు. మ్యాట్‌విజ్ ఇంజన్యుటి తరపున సహ వ్యవస్థాపకుడు ఎం. వీరేశ్, ఉత్పత్తి అభివృద్ధి విభాగం అధిపతి ఎస్. రామ్ కిషన్ హాజరయ్యారు.

ప్రయోజనాలు

విశ్వవిద్యాలయ విద్యార్థులకు ఈ ఒప్పందం ద్వారా సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుందని, పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా వారు సిద్ధమవుతారని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్, ఓయస్డి ప్రొఫెసర్ ఇ. మురళీ దర్శన్ ఆకాంక్షించారు.

# జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు: డిపిఆర్ఓ విష్ణువర్ధన్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 01 (భారత శక్తి):

నిర్మల్ జిల్లాలో జర్నలిస్టులకు జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు నెలలు పొడిగించినట్లు జిల్లా సమాచార ఐ పౌర సంబంధాల అధికారి విష్ణువర్ధన్ తెలిపారు.

అక్రిడిటేషన్ కార్డులు కలిగిన జర్నలిస్టులు తమ ఒరిజినల్ కార్డులతో జిల్లా సమాచార ఐ పౌర సంబంధాల కార్యాలయానికి హాజరుకావాలని ఆయన సూచించారు. గడువు పొడిగింపుకు సంబంధించి ప్రత్యేక స్టిక్కర్లు కార్యాలయంలో వేయించుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.



# 21 కి.మీ హాఫ్ మారథాన్ పూర్తి చేసిన ఖజానా శాఖ ఉద్యోగి విజయ్ కుమార్.




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 01 (భారత శక్తి) నిర్మల్ జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న విజయ్ కుమార్ అరుదైన ఘనత సాధించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహించిన "రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్" కార్యక్రమంలో భాగంగా జరిగిన హాఫ్ మారథాన్ (21 కి.మీ.)ను విజయవంతంగా పూర్తి చేశారు.

ఉద్యోగ బాధ్యతలతో పాటు క్రీడాపట్ల ఆసక్తి చూపుతూ క్రమశిక్షణతో సాధన చేసి ఈ విజయాన్ని అందుకోవడం విశేషం. సమాజంలో బాలికల అభ్యున్నతి కోసం నిర్వహించిన ఈ పరుగు పోటీలో ఆయన పాల్గొని 21 కిలోమీటర్ల దూరాన్ని పూర్తి చేయడం పట్ల జిల్లా వాసులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

విజయ్ కుమార్ సాధించిన ఈ ఘనత నిర్మల్ జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ఆయనకు సహచర ఉద్యోగులు, స్నేహితులు మరియు పలువురు క్రీడాభిమానులు అభినందనలు తెలియజేస్తున్నారు.

# పోలీసోంకీ నజర్ గల్లీ గల్లీ మే గస్తి -కట్టుదిట్టంగా వాహన తనిఖీలు



సైబరాబాద్, (మార్చి 01):(భారత శక్తి):

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 'విజిబుల్ పోలీసింగ్'ను ముమ్మరం చేస్తూ గల్లీ గల్లీలో గస్తీ పెంచారు. ఇందులో భాగంగా బాలానగర్ ఏసిపి నరేష్ రెడ్డి పర్యవేక్షణలో బాలానగర్, అల్లాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద కదలికలపై నిశితంగా దృష్టి సారించిన పోలీసులు వాహనదారులకు నిబంధనలపై అవగాహన కల్పించారు.

బాలానగర్ ఇన్‌స్పెక్టర్ నరసింహ రాజు ఆధ్వర్యంలో గురుమూర్తినగర్ ప్రధాన రహదారి వద్ద తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల లైసెన్సులు, వాహన పత్రాలను పరిశీలించడంతో పాటు పెండింగ్ చలానాలు ఉన్న వాహనాలను గుర్తించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఎదురయ్యే పరిణామాలను వాహనదారులకు వివరించారు.

అటు అల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి నేతృత్వంలో విష్ణు విస్తారా రోడ్డులో ముమ్మరంగా తనిఖీలు జరిగాయి. అనుమానిత వ్యక్తులను విచారించడంతో పాటు వాహనాల కదలికలపై నిఘా ఉంచారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

# ముగిసిన స్వామి వారి బ్రహ్మోత్సవాలు -నేటి నుండి యధావిధిగా నిత్య కైంకర్యాలు



భారతశక్తి ప్రతినిధి, యాదాద్రి భువనగిరి (మార్చి 01):

తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉత్సవాలలో భాగంగా శనివారం ఉదయం స్వామి వారికి శతఘటాభిషేకం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ అభిషేకంలో భాగంగా పంచామృతాలు, పవిత్ర నదీజలాలు, ఫలరసాలతో పాటు పలు సుగంధ ద్రవ్య ఫలములతో అభిమంత్రించబడిన పవిత్ర జలములను 108 కలశాలలో నింపి గర్భాలయంలోని స్వామి అమ్మవార్ల మూలవిరాట్టు, ఉత్సవమూర్తులను అభిషేకం చేయటం జరిగింది. అదేవిధంగా సాయంత్రం వేళలో స్వామి అమ్మవార్లకు శృంగార డోలోత్సవం నిర్వహించి ఉత్సవ సమాప్తి చేశారు. బ్రహ్మోత్సవాలలో ముఖ్య ఘట్టాలైన స్వామి వారి ఎదుర్కోలు, తిరు కల్యాణ మహోత్సవం, రథోత్సవం, చక్రతీర్థం కార్యక్రమాలను ఏ ఆటంకం లేకుండా ఆలయ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జె.భవానీ శంకర్ ఐఏఎస్, చైర్మన్ బి.నరసింహమూర్తి, డిఈవో భాస్కర్ శర్మ, ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యులు, అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి నిత్య కైంకర్యాలు×

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 18 నుండి నిలిపివేసిన నిత్య కైంకర్యాలు అయినటువంటి స్వామి వారి నిత్యకళ్యాణం, సుదర్శన నారసింహ హోమం, మొక్కు జోడు శేవలు లాంటి పలు సేవలను నేటి నుండి పునరుద్ధరించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

# నివాస ప్రాంతాల మధ్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం వద్దు.... స్థానికులు ఆందోళన...

తిరుపతి (మార్చి 01):(భారత శక్తి):

అర్బన్ పరిధిలోని మంగళం రోడ్డు కూరపాటి లేఔట్ కె.ఆర్.నగర్ ప్రాంతంలో నివాస ప్రాంతాల మధ్య మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణాన్ని స్థానికులు అడ్డుకున్నారు. సర్వే నంబర్లు 180, 181, 183, 185, 187లోని సుమారు 97 అంకణాల విస్తీర్ణంలో ఆసుపత్రి నిర్మాణం కొనసాగుతుండటంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తుడా నిబంధనల ప్రకారం లేఔట్‌లోని నివాసాల మధ్య 20 పడకల కంటే తక్కువ సామర్థ్యం గల ఆసుపత్రులకు అనుమతి ఇవ్వాలన్న 60 అడుగుల రోడ్డు తప్పనిసరిగా ఉండాలని నిబంధన చెప్తోందని ఇక్కడ 40 అడుగుల రోడ్డులోనే 6 అంతస్తులతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేస్తున్నారని పేర్కొన్నారు . ఇది నిబంధనలకు విరుద్ధం కాదా అని ప్రశ్నించారు . అదేవిధంగా చిన్న రహదారి, డెడ్ ఎండ్ వీధిలో ఇలాంటి భారీ ఆసుపత్రి నిర్మాణం చేయడం రూల్స్‌కు వ్యతిరేకమని పేర్కొన్నారు.ఈ అంశంపై గతంలోనే కలెక్టర్ మరియు మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించుకున్నప్పటికీ ఎటువంటి స్పందన లభించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఆసుపత్రులకు లేదా వైద్యులకు వ్యతిరేకం కాదని, అయితే జనావాసాల మధ్య భారీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. రెసిడెన్షియల్ ఫ్లాట్ల మధ్య కమర్షియల్ హాస్పిటల్ నిర్మాణానికి అనుమతులు ఎలా మంజూరు చేశారో అధికారులను ప్రశ్నించారు. తుడా మరియు మున్సిపల్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు జారీ చేశారని ఆరోపించారు. హాస్పిటల్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయకపోతే మున్సిపల్ కార్యాలయం మరియు కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించి తమకు న్యాయం చేయాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు వరలక్ష్మి, శ్రీనివాసు మూర్తి, ప్రవీణ్, సావిత్రి, హేమంధర్, జయచంద్ర నాయుడు, నరసింహనాయుడు, ఉమాదేవి, కృష్ణమూర్తి, స్వాతి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ జిల్లా స్థాయి పార్లమెంటు

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, (మార్చి 01):

"వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ - 2026" కార్యక్రమాన్ని మార్చి 4 వ తేదీన లక్కిరెడ్డి బాలి రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె అప్పారావు తెలిపారు ఈ కార్యక్రమానికి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో కళాశాల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా శివ హరి ప్రసాద్ మరియు,ఎన్టీఆర్ జిల్లా యువజన అధికారి సుంకర రాము పాల్గొన్నారు.



ఈ యూత్ పార్లమెంట్--2026లో 18 నుంచి 25 సంవత్సరాలు వయస్సు కలిగిన యువత పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తప్పనిసరిగా ముందుగా తమ పేర్లను మై భారత్ పోర్టల్ లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని సూచించారు.మార్చి 3 వ తేదీన లక్కి రెడ్డి బాలి రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల మైలవరం లో జరిగే కార్యక్రమంలో, రాజ్యాంగం ద్వారా గుర్తింపు పొందిన ఏ భాషలోనైనా "50 ఇయర్స్ ఆఫ్ ఎమర్జెన్సీ: లెసన్స్ ఫర్ ఇండియన్ డెమాక్రసీ" అంశంపై మూడు నిమిషాలు ప్రసంగించాల్సి ఉంటుందని తెలిపారు.ఎన్టీఆర్ జిల్లా నుంచి ప్రతిభ కనబరిచిన 5 మంది ని యువతను రాష్ట్ర స్థాయికి పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా వారు మాత్రమే జిల్లా పార్లమెంటు కు నమోదు కావాలని రిజిస్ట్రేషన్ కోసం నెంబర్లు 9966357021, 8328461854 లలో సంప్రదించాలి.

# స్వామిజి అనుమతితోనే ఆశ్రమం తరలింపు: ఎంపి చామాల

గాంధీ భవన్‌హరీష్ రావుకు,బీజేపీ చీఫ్ రామచందర్ రావుకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు.బీఆర్ఎస్ ప్రభుత్వం లో 150 కోట్ల విలువైన కోకా పెట్ భూములు కేవలం ఒక్క రూపాయికే శారదా పీఠానికి భములు ఇచ్చారు. ప్రాధాన్యత కూడిన ప్రాంతాల్లో నచ్చిన వారికోసం భూములను పేలాల లాగ నాయకులు పంచారు. శారదా పీఠం భూమిని వాళ్ళ అనుమతి తో శంషాబాద్ తరలిస్తున్నారు. శారద పీఠం ఉన్న ఏరియాలో మంజీరా నీళ్ల తో ప్రజలకు మంచినీళ్లు అందించడానికి వాటర్ వర్క్స్ జరుగుతున్నవి. కోర్ అర్బన్ ఏరియాలో మెట్రో, మూసి ని అభివృద్ధి చేయడం ప్రజల కోసమే అని అన్నారు.

ఎక్కడ అభివృద్ధి జరగొద్దని హరీష్ రావు కేటిఆర్ లు అడ్డు పడుతున్నారు. బావ, బామ్మర్ది హరీష్ రావు, కేటిఆర్ పొజిషన్ ఏందో తెలియదు. మేము అపొజిషన్ అంటున్నారు. మా ప్రభుత్వానికి కూడా భక్తి ,శ్రద్ధలు ఉన్నాయి. వేములవాడ, సమ్మక్క సారక్క దేవాలయాలను కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. రాష్ట్రంలో మంచి జరిగితే మళ్ళీ కాంగ్రెస్ కు పట్టం కడతారని హరీష్ రావు, కేటిఆర్ విష బీజాలు వేస్తున్నారని అన్నారు.

మీలాగ కమిషన్ల కోసం కాళేశ్వరం కట్టలేదు. గుజరాత్ లో మోడీ సబర్మతి ని అభివృద్ధి చేసినట్లు తెలంగాణ లో మూసి అభివృద్ధి చేయొద్దా? సబర్మతి కి,మూసి కి సంబంధం లేదు అని రామచందర్ రావు అంటుండు. మూసి కి సబర్మతి కి ఎందుకు సంబంధం లేదని అన్నారు.

గాంధీ నగర్ లో ఉన్న నది ఒడ్డున ఎన్ని ఇండ్లు తీశారు. మీరు అక్రమంగా తొలగించి వచ్చు కానీ ఇక్కడ చేయకూడదా? బీఆర్ఎస్ మాట్లాడిన గంట తర్వత బీజేపీ మాట్లాడుతుంది. డిల్లికి పోయి ఒక మాట గల్లీ లో ఒక మాట మాట్లాడితే ఎట్లా అని అయన ప్రశ్నించారు.

==============================

# ముస్లిం సోదరులతో ఐక్యతకు ప్రతీకగా ఇఫ్తర్ విందు: కాంగ్రెస్ నాయకురాలు అర్చన - నరేష్.



వేములవాడ, (మార్చి 01):(భారత శక్తి): ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల మధ్య స్నేహ సంబంధాలు మెరుగై పరమత సహనం ఏర్పడుతుందని వేముల పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు సరిపెల్లి అర్చన-నరేష్ పేర్కొన్నారు.వారి ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని విద్యానగర్ లోని మొయిన్ మసీదులో పవిత్ర రంజాన్ ఉపవాసాలు ఆచరిస్తున్న ముస్లింలకు శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ లు పాల్గొని ప్రత్యేక ప్రార్థన (దువ)లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లాహ్ దయ అందరిపై ఉండాలని ప్రార్థన చేసినట్లు వారు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సహోదరులు కఠోర ఉపవాసాలతో పాటు భక్తిశ్రద్ధలతో ఉండటం విశేషమన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ కార్యక్రమంలో తాము పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అలాగే మార్చి 21న జరిగే రంజాన్ పండుగను ముస్లింలు కుటుంబ సభ్యుల ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకోవాలని కోరారు. వారందరికీ ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ లకు,సాయిని దేవయ్యకు మైనార్టీ నాయకులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, మౌలాలు, ముస్లింలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల ప్రయోజనాలపై రాజీలేదు: ట్రేడ్‌డీల్ ప్రకటనపై ప్రభుత్వ వర్గాలు



భారత్‌తో ట్రేడ్‌డీల్‌పై అంగీకారానికి వచ్చామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే . అమెరికా ఉత్పత్తులను భారీగా కొనేందుకు భారత్ కట్టుబడి ఉందంటూ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీలేదని స్పష్టతనిచ్చాయి. మన దేశానికి అగ్రరాజ్యం ఎగుమతి చేసే వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు భారత్ తొలినుంచి అంగీకరించడం లేదు. ఇప్పుడు కూడా అదే విషయాన్ని పునరుద్ఘాటించాయి. అలాగే వెనెజువెలా చమురు కొనుగోలు అంశం పరిశీలనలో ఉందని పేర్కొన్నాయి.

అమెరికా తన రైతులకు భారీగా రాయితీలు ఇస్తుంటుంది. దాంతో వారు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెటింగ్ ధరల కంటే తక్కువకు అమ్మగలుగుతారు. కొన్ని సందర్భాల్లో పండించడానికి అయిన వ్యయంకంటే కూడా తక్కువకే ఎగుమతి చేస్తారు. వాటిపై భారత్ సుంకాలు తగ్గిస్తే.. మన రైతులపై తీవ్రప్రభావం పడుతుంది. ఇంతకాలం ట్రేడ్‌డీల్ చర్చల్లో ప్రతిష్టంభనకు ఇది కూడా ఒక కారణంగా ఉంది. తాజాగా ట్రంప్ ప్రకటన నేపథ్యంలో.. అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకాలు తగ్గించిందా..? అనే ప్రశ్నలు ఎదురుకాగా, ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది.

''ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు వెనెజువెలా నుంచి మనం చమురు కొనుగోలు చేయలేదు. ఇప్పుడు వాటిని ఎత్తివేశారు. ఆ చమురును కొంటాం'' అని పేర్కొన్నాయి. ఇంధన కొనుగోళ్ల విషయంలో దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఉంటుందని చెప్పాయి.

కాగా ట్రంప్ తన పోస్టులో.. “వాణిజ్యం, రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు, రష్యా చమురు కొనుగోలు నిలిపివేత, అమెరికా, వెనెజువెలా నుంచి భారత్ మరింత చమురు కొనుగోలు వంటి అంశాలపై భారత ప్రధాని మోదీతో చర్చలు జరిపాం” అని రాసుకొచ్చారు. దీనిపై స్పందించిన మోదీ.. సుంకాల తగ్గింపును ధ్రువీకరించారు కానీ.. వాణిజ్య ఒప్పందం గురించి మాత్రం ప్రస్తావించలేదు.

# సిల్వర్ ఈటీఎఫ్‌ల్లో అదే సీన్.. మరో 19% పతనం




సిల్వర్ ఈటీఎఫ్‌ల పతనం కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో వెండి ధర భారీగా పతనం అయిన నేపథ్యంలో ఆ ప్రభావం వెండి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల మీద కూడా పడింది. శుక్రవారం 20 శాతం వరకు పతనం కాగా.. సోమవారం మరో 19 శాతం మేర పతనం అయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్లకు ఇటీవల కాసుల వర్షం కురిపించిన సిల్వర్ ఈటీఎఫ్‌లు పడిపోవడంతో మదుపర్లు ఆందోళన చెందుతున్నారు.

దేశీయ మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో కిలో వెండి మార్చి కాంట్రాక్టు ధర రూ.2.27 లక్షల వద్ద కొనసాగుతోంది. గురువారం ఇది రూ.4,20,048 వద్ద జీవన కాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. గరిష్ఠాలతో పోలిస్తే కిలో వెండి విలువ దాదాపు రూ.2 లక్షల మేర పతనం అయ్యింది. దీంతో సిల్వర్ ఈటీఎఫ్‌లు క్షీణించాయి.

టాటా సిల్వర్ ఈటీఎఫ్ 19.15 శాతం, ఎస్‌బీఐ సిల్వర్ ఈటీఎఫ్ 14.98, ఆదిత్య బిర్లా న్ లైఫ్ ఈటీఎఫ్ 14.6 శాతం చొప్పున పతనం అయ్యాయి. గ్రో సిల్వర్ ఈటీఎఫ్ 16.17 శాతం, జెరోదా సిల్వర్ ఈటీఎఫ్ 15.41 శాతం, నిప్పాన్ ఇండియా సిల్వర్ ఈటీఎఫ్ 15.69, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ సిల్వర్ ఈటీఎఫ్ 14.05 శాతం, కోటక్ సిల్వర్ ఈటీఎఫ్ 17.38 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ సిల్వర్ ఈటీఎఫ్ 16.65 శాతం, మోతీలాల్ ఓస్వాల్ సిల్వర్ ఈటీఎఫ్ 16.02 చొప్పున పతనం అయ్యాయి. డాలర్ విలువ పెరగడం, ట్రెజరీ బాండ్లపై రాబడి పెరగడం.. అదే సమయంలో మదుపర్ల లాభాల స్వీకరణతో వెండి ధరలు క్షీణిస్తున్నాయి.

# కడప జిల్లా డి.ఎం.డహెచ్.ఓ ఆధ్వర్యంలో డి.ఏ.పి .సి.సి. మరియు కమ్యూనిటీ అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహణ




కడప, (మార్చి 01):(భారత శక్తి):

కడప జిల్లాలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఒఖూంఅూ) ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరియు జిల్లా ఎయిడ్స్ నివారణ ఁ నియంత్రణ కమిటీ ఆధ్వర్యంలో డి.ఏ.పి .సి.యు మరియు పి.ఎం.పి.ఎస్.ఈ కార్యక్రమాలపై కమ్యూనిటీ అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించబడింది.

సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. కె. నాగరాజు గారు మాట్లాడుతూ, హెచ్ఐవి/ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా, విస్తృత స్థాయిలో అమలు చేయాలని సూచించారు. జిల్లాను హెచ్ఐవి రహిత జిల్లాగా తీర్చిదిద్దే దిశగా అన్ని సంబంధిత శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు.

క్లస్టర్ ప్రోగ్రాం అధికారి శ్రీ భాస్కర్ గారు మాట్లాడుతూ, ఒఖూంఅూ ఆధ్వర్యంలో అమలవుతున్న నివారణ కార్యక్రమాలను అన్ని భాగస్వామ్య సంస్థలు గ్రామ స్థాయికి తీసుకెళ్లాలని, కమ్యూనిటీ భాగస్వామ్యాన్ని పెంపొందించాలని సూచించారు. సి.ఏ.జి మరియు సి.ఏ.బి సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ హెచ్ఐవి నివారణ చర్యలను బలోపేతం చేయాలని పేర్కొన్నారు.

జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డా. ఎస్. రవిబాబు గారు మాట్లాడుతూ, ఔజీబితినీనిజీశ్రీ ంఎఆూ అనీనిబితీనీశ్రీ ాతీణజీనితిబజీబితినీని (ఔంఅూ) మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యక్రమాలు అమలు చేయాలని తెలిపారు. హెచ్ఐవి డ్రాప్అవుట్స్ తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, కమ్యూనిటీ అవగాహన కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు.

ఈ సమావేశంలో ఏఆర్‌టి సెంటర్ వైద్యాధికారులు డా. అనూష, డా. హసీఫ్, డిష్ ప్రసాద్, ప్రివెన్షన్ ఆఫీసర్ ఆనంద్, జిల్లా రిసోర్స్ పర్సన్ అల్లావలి, పాజిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షురాలు ఉషారాణి, టి.ఐ. ఎన్జీఓ మేనేజర్లు మరియు కమ్యూనిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మినహాయింపు పెంచలేదు.. శ్లాబులు సవరించలేదు



బిజినెస్ బ్యూరో: కేంద్ర బడ్జెట్‌లో పన్ను శ్లాబులలో మార్పులుంటాయని, మరో కొత్త పన్ను విధానం వస్తుందని ఊహాగానాలొచ్చాయి. వరసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్.. పన్ను రేట్లను సవరించకుండా, స్థిరంగా కొనసాగించేందుకే మొగ్గు చూపారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం అమల్లోకి వస్తుందన్నారు. కొత్త, పాత పన్ను విధానంలో కానీ, శ్లాబుల విషయం గురించి ప్రస్తావించలేదు. ప్రత్యక్ష పన్నులకు సంబంధించి కొన్ని మార్పులను తీసుకొచ్చారు.

విదేశీ ఆస్తుల వెల్లడికి 6 నెలల గడువు

పన్ను చెల్లింపుదారులు తమ విదేశీ ఆస్తులను వెల్లడించేందుకు వీలుగా కేంద్రం ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది. విద్యార్థులు, టెక్ నిపుణులు, విదేశాల నుంచి తిరిగొచ్చిన ప్రవాస భారతీయుల కోసం 6 నెలల పాటు ‘ఫారిన్ అసెట్ డిస్‌క్లోజర్ స్కీమ్’ అందుబాటులో ఉంటుంది.

ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలులో వెసులుబాటు కల్పిస్తూ గడువును పెంచారు. రివైజ్డ్, అప్‌డేటెడ్ ఐటీ రిటర్నుల దాఖలు గడువును డిసెంబరు 31 నుంచి మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. ఐటీఆర్-1, ఐటీఆర్-2 దాఖలు చేసే వ్యక్తులు జులై 31 వరకూ తమ రిటర్నులు దాఖలు చేయొచ్చు.

# ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించిన కేంద్ర బృందం

## -పర్యటన వివరాలను జిల్లా కలెక్టర్ కు వివరించిన కేంద్ర బృందం సభ్యులు

సూర్యాపేట(, (మార్చి 01):(భారత శక్తి):



జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలన నిమిత్తం కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ నుండి వచ్చిన కేంద్ర బృందం సభ్యులు తేదీ.26-2-2028 నుండి 28-2-2026 వరకు పర్యటించినది. తేదీ.26-2-2026 న తుంగతుర్తి మండలం తుంగతుర్తి గొట్టిపర్తి గ్రామపంచాయతీల ఉపాధి హామీ పనులను, రికార్డులను పరిశీలించారు, తేదీ. 27-2-2026 న నూతనకల్ మండలం దర్శించర్ల, సోమ్లా తండా గ్రామ పంచాయతీలను సందర్శించి ఉపాధి హామీ పనులను రికార్డులను పరిశీలించారు.అనంతరం తేదీ 28-2-2026 న శనివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సందర్శన వివరాలను కేంద్ర కమిటీ సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కేంద్ర బృందం సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దిల్ కుష్ మీనా, సంజయ్ పాండే,జాగృతి రాయ పాల్గొన్నారు.




# మడమ నొప్పి వేధిస్తోందా.. ఇలా చేస్తే సరి

మడమ నొప్పితో బాధపడే వారు చిన్న చిన్న వ్యాయామాలతో వాటి నుంచి రిలీఫ్ పొందొచ్చు. కొందరిలో మడమ నొప్పి చాలా తీవ్రంగా ఉంటుంది. పాదం కింద పెట్టగానే భరించలేనంత నొప్పితో పాటు అడుగు తీసి అడుగు వేయటమే కష్టంగా ఉంటుంది. రెండు మూడు గంటల పాటు ఇదే పరిస్థితి ఉండొచ్చు. కొందరికైతే రోజంతా మడమ నొప్పే ఉంటుంది. ప్లాంటార్ ఫేషియైటిస్ సమస్య ఇలాగే వేధిస్తుంది. పరుగెత్తేవారు, రోజులో ఎక్కువసేపు నిలబడే పనులు చేసేవారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుంటుంది. దీనికి మూలం పాదం అడుగున ఎముకలకు అతుక్కొని ఉండే బిగుతైన పొర 'ప్లాంటార్ ఫేషియా'వాపు. ఈ పొర పాదం వెనక, ముందు వేళ్ల ఎముకలకు అతుక్కొని ఉంటుంది. కానీ పాదం మధ్యలో ఎక్కడా అతుక్కోదు. ఊబకాయం, కదలకుండా ఉండటం, అతి వాడకం, చదును పాదాలు, పల్చటి చెప్పల వాడకం వంటి రకరకాల కారణాలతో అక్కడక్కడా చిరుగుతూ, మళ్లీ అతుక్కుంటూ వస్తుంటుంది. క్రమంగా దృఢంగా ఉండాల్సిన తంత్రులు క్షీణిస్తాయి. దీంతో పాదం వెనక ఎముక దగ్గర అతుక్కునే చోట వాపు తలెత్తి, నొప్పి మొదలవుతుంటుంది. దీని బారినపడ్డవారు మందులు వాడుతున్నా కొన్ని వ్యాయామాలు చేయటం మంచిది. ఇవి పిక్క, పాదం కండరాలు సాగేలా, బలోపేతమయ్యేలా చేసి.. నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

### బంతితో రుద్దటం

కుర్చీలో కూర్చొని లేదా నిల్చొని పాదం కింద చిన్న బంతిని పెట్టుకోవాలి. నెమ్మదిగా పాదాన్ని ముందుకూ వెనక్కూ 10 సార్లు కదిలించాలి. కాసేపు ఆగి మళ్లీ చేయాలి. దీంతో పాదానికి మంచి మర్దన లభిస్తుంది. బంతికి బదులు గుండ్రటి బాటిల్‌నూ వాడుకోవచ్చు. చల్లటి నీటిని నింపిన బాటిలైతే ఇంకా మంచిది. పాదం నొప్పి పుట్టినప్పుడే దీన్ని చేయాలి. బంతిని లేదా బాటిల్‌ను తగినంత ఒత్తిడితో అదమాలి. కానీ నొప్పి పుట్టేలా నొక్కకూడదు.



### మడమ దించటం

వేళ్లు, పాదం మధ్య భాగం మెట్టు మీద ఆనించి.. మడమలు గాల్లో తేలుతూ ఉండేలా నిల్చోవాలి. నెమ్మదిగా మడమలను మెట్టు అంచు కిందికి వచ్చేలా కిందికి దించాలి. ఈ సమయంలో పిక్క కండరాలు సాగుతున్న భావన కలుగుతుంది. తర్వాత నెమ్మదిగా మడమలను పైకి లేపాలి. ఇలా పది సార్లు చేసి, విశ్రాంతి తీసుకోవాలి. మరోసారి ఇలాగే చేయాలి. దీన్ని చాలా నెమ్మదిగా, కదలికలను నియంత్రణలో ఉంచుకొని చేయాలి. తూలకుండా చూసుకోవాలి. మెట్ల పక్కన రెయిలింగ్‌ను పట్టుకోవాలి.

### మడమ తిప్పటం


నేల మీద కూర్చొని, కాళ్లు స్ట్రెయిట్గా చాపాలి. ఎడమ కాలును కుడి కాలు మీద మోపాలి. కుడికాలుకు రబ్బరు బ్యాండును కట్టి, దాన్ని ఎడమ పాదం వెనక నుంచి తేవాలి. రబ్బరు బ్యాండును చేత్తో గట్టిగా పట్టుకోవాలి. కుడి పాదాన్ని నెమ్మదిగా ముందు వైపునకు చాచాలి. ఈ సమయంలో పాదం వెలుపలి వైపునకు సాగేలా చూసుకోవాలి. కాసేపు అలాగే ఉండి, యథాస్థితికి రావాలి. దీని పది సార్లు చొప్పును రెండు పర్యాయాలు చేయాలి.పాదం మరీ ఎక్కువగా నొప్పి పుట్టకుండా చూసుకోవాలి.





### కాలి వేళ్లతో తువ్వాలు చుట్టటం

కుర్చీలో తిన్నగా కూర్చోవాలి. నేల మీద తువ్వాలు పరచి, దాని మీద ఒక పాదాన్ని పెట్టాలి. కాలి వేళ్లతో తువ్వాలును పట్టుకొని, కుర్చీ వైపు మడవటానికి ప్రయత్నించాలి. దీన్ని 10 సార్ల చొప్పున రెండు పర్యాయాలు చేయాలి. పాదం మొత్తం నేలకు ఆనించి ఉంచాలి. కేవలం వేళ్లతోనే ఈ వ్యాయామం చేయాలి.



### పాదం పొర సాగదీత


కుర్చీలో కూర్చొని, ఒక కాలును మోకాలు మీదికి తీసుకురావాలి. ఒక చేత్తో మడమను, మరో చేత్తో వేళ్లను పట్టుకోవాలి. నెమ్మదిగా వేళ్లను వెనక్కి లాగాలి. ఈ సమయంలో పాదం అడుగు భాగం సాగుతున్న భావన కలుగుతుంది. వేళ్లను 20 సెకన్ల పాటు అలాగే పట్టుకొని, విశ్రాంతి తీసుకోవాలి. దీన్ని మూడు సార్లు చేయాలి. నెమ్మదిగా వేళ్లను సాగదీయాలి. ఎక్కువగా నొప్పి పుట్టకుండా చూసుకోవాలి.

### పిక్క సాగదీత

చేతులకు అందేంత దూరంలో గోడకు ఎదురుగా తిన్నగా నిల్చోవాలి. గోడ మీద చేతులను ఆనించాలి. రెండు పాదాలు నేల మీద సమతలంగా ఉండాలి. ఒక కాలును ముందుకు తెచ్చి, చేతులతో గోడను నొక్కుతూ ముందుకు వంగాలి. ఈ సమయం లో పిక్క భాగం సాగుతున్న భావన కలుగుతుంది. 20 సెకన్ల పాటు అలాగే ఉండి, యథాస్థితికి రావాలి. రెండో కాలుతోనూ ఇలాగే చేయాలి. ముందుకు వంగినప్పుడు వెనక కాలు, నడుం స్ట్రెయిట్గా ఉండాలి. మడమ నేల మీది నుంచి పైకి లేవకూడదు.

# రోజుకో బత్తాయి.. ఆరోగ్యానికి మేలోయి

బత్తాయిలు.. ఇవి రెగ్యులర్‌గా తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచివి. ఇందులో ఎక్కువగా విటమిన్ సి ఉంటుంది. దీని వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. శరీరంలోని ఫ్రీ రాడికల్స్ తగ్గిపోతాయి. వీటితో పాటు మరిన్ని లాభాలు కూడా ఉన్నాయి. వాటన్నింటి గురించి తెలుసుకుందాం.



### జీర్ణక్రియ..

బత్తాయిల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణ సమస్యల్ని దూరం చేస్తుంది. ఇందులోని ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల ఎక్కువగా మనం జీర్ణ సమస్యలు రాకుండా ఉంటాయి. బత్తాయిల్లో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. దీంతో చాలా వరకూ క్యాన్సర్ కణాలకు వ్యతిరేకంగా పోరాడతాయి. దీంతో హ్యాపీగా వీటిని తీసుకోవచ్చు. అదే విధంగా, ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ అలర్జీలను కూడా తగ్గిస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల చాలా వరకూ అలర్జీలు తగ్గిపోతాయి.

### షుగర్ ఉన్నవారికి..

షుగర్ ఉన్నవారు బత్తాయి జ్యూస్ తాగడం చాలా ముఖ్యం. ఇందులో తక్కువగా గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. కాబట్టి, వీటిని తీసుకోవడం వల్ల చాలా వరకూ ఉపయోగం ఉంటుంది.

### బరువు..

బరువు తగ్గాలనుకునేవారు కేలరీలను తక్కువగా తీసుకోవాలి. పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఆ రెండు కూడా ఈ బత్తాయిల వల్ల సాధ్యం. బత్తాయిల్లో కేలరీలు తక్కువగానూ, పీచుపదార్థాలు ఎక్కువగానూ ఉంటాయి. దీని వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గి బరువు కూడా అదుపులో ఉంటుంది.

### గుండెకు ఆరోగ్యం..

బత్తాయిలు తినడం వల్ల గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. దీనికోసం ఇందులోని విటమిన్ సి, ఫైబర్ హెల్ప్ చేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. కాబట్టి, వీటిని రెగ్యులర్‌గా తినాలి. దంత సమస్యలు.. బత్తాయిల్లో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, వీటిని రెగ్యులర్‌గా తింటే ఆ పీచు పదార్థం కారణంగా దంత సమస్యలు దూరమవుతాయి. కాబట్టి, వీటిని రెగ్యులర్‌గా తీసుకోండి.

# ఇన్వర్టర్ వాడుతున్నారా.. జాగ్రత్తలు తప్పనిసరి

సమ్మర్ వచ్చేసింది. ఈ సీజన్‌లో విద్యుత్ వాడకం ఎక్కువగా ఉంటుంది. అలాగే కరెంట్ కోతలు కూడా ఉంటాయి. అందుకే చాలామంది ఇన్వర్టర్‌ను తెచ్చుకుంటారు. కరెంట్ లేనప్పుడు దీనిని వాడుతారు. అయితే, ఇంట్లో ఇన్వర్టర్‌ని ఉపయోగిస్తున్నప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.


- ఇన్వర్టర్ వైరింగ్‌ని చెక్ చేయాలి. వైరింగ్‌లో ఏదైనా లోపం ఏర్పడితే ఇన్వర్టర్ త్వరగా పాడవుతుంది. అందుకే వైరింగ్‌ను తరచుగా చెక్ చేస్తూ ఉండాలి. వదులుగా ఉన్న కనెక్షన్లను గట్టిగా బిగించాలి. అవసరమైతే దెబ్బతిన్న వైర్లను మార్చుకోవాలి.
- ఇన్వర్టర్‌ను సర్వీసింగ్ చేయాలి .వేసవిలో దానిపై ఎక్కువ లోడ్ పడుతుంది. తరచుగా సర్వీసింగ్ చేయడం వల్ల ఎటువంటి సమస్యలు ఉండవు. సర్వీసింగ్‌లో ఇన్వర్టర్‌ను శుభ్రపరచడం, ఆయిల్ మార్చడం, ఇతర అవసరమైన పనులు చేస్తూ ఉండాలి. ఇన్వర్టర్‌ను వెంటిలేషన్ ఉన్న పొడి ప్రదేశంలో పెట్టాలి. సూర్యకాంతి పడని చోట పెట్టాలి. గాలి సులభంగా అందేవిధంగా ఉండాలి. చుట్టూ తగినంత స్థలం ఉండాలి. ఇన్వర్టర్‌ను ఎప్పుడూ ఓవర్ లోడ్ చేయవద్దు. అవసరమైన మేరకే వాడాలి. ఇన్వర్టర్‌ను స్విచాఫ్ చేస్తున్నప్పుడు దీంతో నడిచే అన్ని ఎలక్ట్రానిక్స్‌ను ఆఫ్ చేయాలి. ఇన్వర్టర్ దగ్గర మండే పదార్థాలను ఉంచొద్దు.

ఇన్వర్టర్ బ్యాటరీని చెక్ చేస్తూ ఉండాలి ఇన్వర్టర్‌లో బ్యాటరీ అత్యంత ముఖ్యమైన భాగం. వేసవిలో బ్యాటరీ త్వరగా పాడైపోయే అవకాశాలు ఉంటాయి. బ్యాటరీలో ఉండే నీటిని తరచుగా చెక్ చేస్తూ ఉండాలి. అవసరమైతే నీటిని మార్చుతూ ఉండాలి. బ్యాటరీ టెర్మినల్స్ శుభ్రం చేస్తూ ఉండాలి. బ్యాటరీ ఛార్జింగ్ సామర్థ్యాన్ని పరిశీలిస్తూ ఉండాలి.



## సినిమా

# మిగిలింది ఇక్కడే



ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం డ్రాగన్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఎన్టీఆర్ ఆర్ట్స్, మైత్రి మూవీ మేకర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలను అత్యంత గ్రాండ్‌గా, ఇంటెన్స్‌గా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల సమయంలో ఈ చిత్ర బృందం జోర్డాన్‌లో షూటింగ్ నిర్వహించడం టాలీవుడ్‌లో కలకలం రేపింది. వాస్తవానికి జోర్డాన్ షెడ్యూల్ మార్చి మొదటి వారం వరకు కొనసాగాల్సి ఉన్నప్పటికీ, అక్కడి పరిస్థితులను ముందుగానే అంచనా వేసి ఫిబ్రవరి 22 నాటికే షూటింగ్ పూర్తి చేసి ఇండియాకు తిరిగి వచ్చేసింది. ఈ కీలక షెడ్యూల్‌లో సినిమాకు హైలైట్‌గా నిలిచే మూడు భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించినట్లు సమాచారం. ఇక మిగిలిన షూటింగ్ మొత్తం దేశీయ లొకేషన్లలోనే జరగనుండటంతో రిలీజ్‌పై ఎలాంటి ప్రభావం ఉండదని మేకర్స్ ధీమాగా ఉన్నారు. అన్ని కార్యక్రమాలు అనుకున్నట్లుగా సాగితే జూన్ 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడానికి చిత్ర బృందం సిద్ధమవుతోంది.

# ఫ్యాన్స్‌కు ట్రీట్

## దేశవ్యాప్తంగా స్వీట్ల పంపిణీ, అన్నదానం



ఇటీవల ఏడడుగుల బంధంతో ఒక్కటైన విజయ్ దేవరకొండ, రష్మిక జంట ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్ ట్రీట్ ఇవ్వనుంది. కొత్తగా పెండ్లైన ఆనందంలో అభిమానులకు 'తీపి' కానుక ఇవ్వాలని నిర్ణయించుకుంది. ఇవాళ దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన నగరాల్లో మిఠాయిలు పంచుతూ, ఆలయాల్లో అన్నదానం నిర్వహిస్తూ తమ వివాహాన్ని సెలబ్రేట్ చేసుకోనుంది. తెలంగాణ, ఏపీ సహా పలు రాష్ట్రాల్లోని నగరాల్లో స్వీట్లను పంచనున్నారు. ఈమేరకు 'విరోష్'జోడీ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. 'మీరంతా మా జర్నీలో, ప్రేమలో ఓ భాగం. మా పెళ్లి వేడుకలను మీతో సెలబ్రేట్ చేసుకోవడం నిజంగా మాకు సంతోషాన్ని కలిగిస్తోంది. మనకు వేడుక అంటే స్వీట్లే. అందుకే మిఠాయిలు, ప్రేమ నిండిన ట్రక్కులను మార్చి 1న దేశవ్యాప్తంగా పంపిస్తున్నం. మాకు మీ అందరి ఆశీర్వాదాలు కావాలి' అని కోరింది. ఇక తెలుగు రాష్ట్రాల్లో.. హైదరాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, విశాఖపట్నం, విజయవాడ, పుట్టపర్తిలో స్వీట్ల పంపిణీ చేపట్టనున్నారు. సాయిబాబా దేవాలయం (చింతపల్లి), మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయం (మహబూబ్‌నగర్), హరేకృష్ణ హెరిటేజ్ టెంపుల్ (హైదరాబాద్), శ్రీకనక మహాలక్ష్మి ఆలయం(విశాఖపట్నం), శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం (ద్వారకా తిరుమల), శ్రీకనకదుర్గ (విజయవాడ) అమ్మవారి ఆలయాల్లో అన్నదానం చేయనున్నారు. గత నెల 26న ఉదయ్‌పూర్‌లో వివాహం చేసుకున్న విరోష్ జంట ఇప్పటికే హైదరాబాద్ చేరుకుంది. రిసెప్షన్ ఈ నెల 4న గ్రాండ్‌గా నిర్వహించనున్నారు.

# స్వచ్ఛమైన ఆనందం

'చాణక్యుడు' మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ ఇషితా దత్తా. ఆ తర్వాత మాత్రం బాలీవుడ్‌లోనే సెటిలైంది. దృశ్యం-1, దృశ్యం- 2, ఫిరంగి, బ్లాంక్‌వంటి హిందీ చిత్రాల్లో తళుక్కుమని మెరిసింది. అజయ్ దేవగన్, రకుల్‌ప్రీత్ సింగ్, ఆర్ మాధవన్, గౌతమి కపూర్ లతో కలిసి నటించిన 'దేదే ప్యార్ దే '2 సినిమాలో ఇషికా చివరిసారిగా కనిపించింది. ఇప్పుడు దృశ్యం ఫ్రాంచైజీ మూడో విడతలోనూ కనివిందు చేయనుంది. ఇక రిష్తాన్ కా సౌధాగర్: బాజీగర్ సీరియల్ చేసే సమయంలో నటుడు వస్తల్ సేత్‌తో ప్రేమలో పడింది. 2017లో అతడిని పెండ్లి చేసుకుంది. వీరికి 2023లో బాబు జన్మించగా 2025లో పాప పుట్టింది. ప్రస్తుతం వ్యక్తిగత జీవితాన్ని హాయిగా గడిపేస్తూ,, తన పిల్లల ఆటలు, అలకలకు సంబంధించిన వీడియోలను అప్పుడప్పుడు నెట్టింట షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. 'తల్లయ్యాక నా జీవితమే మారిపోయింది. చిక్కుల జుట్టు, ఇంట్లో ఎక్కడపడితే అక్కడ బొమ్మలు.. ఎప్పటికీ పూర్తవని పనులు.. అవి కాకుండా సంబంధం లేని ప్రదేశాల్లో కూడా స్టిక్కర్లు.. తల్లి జీవితం ఇలాగే ఉంటుంది. కానీ ఇందులో స్వచ్ఛమైన ఆనందం దాగి ఉంది' అని రాసుకొచ్చింది.

# 'పెద్ది'కి డబ్బింగ్


## షురూ చేసిన రామ్ చరణ్...



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన తదుపరి చిత్రం 'పెద్ది'కి సంబంధించి కీలక అప్డేట్‌ను అభిమానులతో పంచుకున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా డబ్బింగ్ పనులను రామ్ చరణ్ తాజాగా ప్రారంభించారు. 'ఆర్ఆర్ఆర్' తర్వాత చరణ్ నటిస్తున్న సోలో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. డబ్బింగ్ ప్రారంభించిన విషయాన్ని రామ్ చరణ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించారు. డబ్బింగ్ స్టూడియోలో దర్శకుడు బుచ్చిబాబుతో సరదాగా గడుపుతున్న 'బిహైండ్ ది సీన్స్' (బీటీఎస్) వీడియోను ఆయన పోస్ట్ చేశారు. ఈ వీడియోలో దర్శకుడిని రామ్ చరణ్ ఆటపట్టిస్తూ, నవ్విస్తూ కనిపించారు. "పెద్ది డబ్బింగ్ స్టార్ట్స్... వాట్ ఈజ్ ఇట్" అంటూ చరణ్ ఆసక్తికరమైన క్యాప్షన్ జోడించారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇటీవలే ఫిబ్రవరి 15న బుచ్చిబాబు పుట్టినరోజు సందర్భంగా చరణ్ సోషల్ మీడియాలో ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. బుచ్చిబాబు ప్యాషన్, కథలోని అంశాలను డీల్ చేసే విధానం తనకు ప్రతిరోజూ స్ఫూర్తినిస్తోందని చరణ్ పేర్కొన్నారు. తాజా వీడియోలో వీరిద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం మరోసారి స్పష్టమైంది. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, సీనియర్ నటుడు జగపతి బాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వృద్ధి సినిమాస్, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, రత్నవేలు సినిమాటోగ్రఫీ బాధ్యతలు, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు చేపడుతున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# "మోదీజీ కాపాడండి"..

## దుబాయ్ లో చిక్కుకున్న సోనాల్ చౌహాన్ విజ్ఞప్తి




పశ్చిమ ఆసియాలో యుద్ధ జ్వాలల ప్రభావం సెలబ్రిటీలపై కూడా పడింది. హాలిడే ట్రిప్ కోసం దుబాయ్ వెళ్లిన నటి సోనాల్ చౌహాన్.. యుద్ధం కారణంగా విమాన సర్వీసులు రద్దు కావడంతో అక్కడే చిక్కుకుపోయారు. విమానాశ్రయాలు మూతపడటంతో ఆమె స్వదేశానికి తిరిగి వచ్చే మార్గం లేక ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఆమె సోషల్ మీడియా వేదికగా భారత ప్రధాని నరేంద్ర మోదీకి అత్యవసర విజ్ఞప్తి చేశారు. ''గౌరవనీయ ప్రధాని మోదీ జీ.. ప్రస్తుత యుద్ధ సంక్షోభం కారణంగా నేను దుబాయ్‌లో చిక్కుకున్నాను. విమానాలు రద్దయ్యాయి, ఇంటికి రావడానికి వేరే దారి లేదు. దయచేసి నేను సురక్షితంగా భారత్ చేరుకోవడానికి సహకరించండి'' అని ఆమె తన పోస్టులో కోరారు. కాగా, ఇప్పటికే భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కూడా దుబాయ్ విమానాశ్రయంలోనే చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. యుద్ధం కారణంగా అంతర్జాతీయ ప్రయాణాలు అస్తవ్యస్తం కావడంతో అక్కడ ఉన్న భారతీయులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# సీఎం రేవంత్‌ను కలిసిన రష్మిక.. అల్లు వారి ఇంటికి 'విరోష్' జోడి

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబాన్ని కథానాయిక, విజయ్ దేవరకొండ సతీమణి రష్మిక కలిశారు. మార్చి 4న హైదరాబాద్‌లో జరగనున్న తమ వివాహ రిసెప్షన్‌కు రావాల్సిందిగా సీఎం రేవంత్ కుటుంబాన్ని ఆహ్వానించారు. నూతన వధువు రష్మికను సీఎం కుటుంబం సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. తెలుగు సంప్రదాయాన్ని పాటిస్తూ కొత్త పెళ్లి కూతురికి బట్టలు పెట్టి ఆశీర్వదించారు.

**అల్లు వారి ఇంటికి విరోష్‌జోడి..**

అల్లు వారి ఇంట పెళ్లి బాజా మోగడానికి సిద్ధమైన సంగతి తెలిసిందే. అల్లు శిరీష్ వివాహం మార్చి 6న జరగనుంది. ఈ సందర్భంగా కాబోయే పెళ్లి కొడుకు అల్లు శిరీష్‌ను నూతన వధూవరులు విజయ్ దేవరకొండ, రష్మిక కలిసి శుభాకాంక్షలు చెప్పారు. అలాగే, తమ వివాహ రిసెప్షన్‌కు రావాల్సిందిగా అల్లు అరవింద్, అల్లు అర్జున్ సహా కుటుంబ సభ్యులను స్వయంగా ఆహ్వానించారు. పెళ్లి తర్వాత తొలిసారి ఇంటికి వచ్చిన కొత్త జంటకు అల్లు అర్జున్ శుభాకాంక్షలు చెప్పారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# బల్దియా ఖజానాకు 100ల కోట్ల అవినీతి గండి...!


హైదరాబాద్, మార్చి 1 (భారత శక్తి): ప్రభుత్వ ఆదాయానికి రక్షణ కవచంలా ఉండాల్సిన అధికారులే భక్షకులుగా మారారు. నిబంధనలను తుంగలో తొక్కి, బడా వ్యాపారులతో అపవిత్ర కలయిక సాగించి జీహెచ్ఎంసీ (GHMC) ఖజానాకు కన్నం వేస్తున్నారు. సామాన్యుడు తన అవసరం కోసం ఒక చిన్న గది నిర్మించుకుంటే చాలు.. డ్రోన్ కెమెరాలతో నిఘా వేసి, నోటీసులతో ఉక్కిరిబిక్కిరి చేసే బల్దియా యంత్రాంగం, కోట్లాది రూపాయల పన్ను ఎగవేస్తున్న అక్రమార్కుల ముందు మాత్రం మోకరిల్లుతోంది. ముఖ్యంగా సరూర్ నగర్ సర్కిల్ కేంద్రంగా సాగుతున్న ఈ 'పన్ను'గడ అక్షరాలా ప్రజాధనాన్ని పక్కదారి పట్టిస్తోంది.




**గణాంకాల సాక్షిగా.. గారడీ ఇలా!**

దిల్‌సుఖ్‌నగర్ వంటి అత్యంత రద్దీ ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాల విస్తీర్ణాన్ని రికార్డుల్లో మాయం చేయడం ద్వారా అధికారుల 'వసూళ్ల' పర్వం సాగుతోంది. పరిశోధనలో తేలిన కొన్ని దిగ్భ్రాంతికర అంశాలు ఇవే:

**1. సాయిబాబా ఆలయ సముదాయం (డోర్ నెం: 13-9-46/1/NR నుండి 13-9-48/20/NR):**



ఇక్కడ క్షేత్రస్థాయిలో గ్రౌండ్ + 2 అంతస్తుల్లో కలిపి సుమారు 30,000 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండగా, రికార్డుల్లో మాత్రం కేవలం 18,859 చ.అ. మాత్రమే చూపిస్తున్నారు. అంటే సుమారు 11,141 చదరపు అడుగుల విస్తీర్ణానికి అసలు పన్నే కట్టకుండా ఏళ్ల తరబడి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇది కేవలం నిర్లక్ష్యం కాదు, అధికారుల అంతర్గత ఒప్పందమేనని స్పష్టమవుతోంది.

**2. సాయిరాం హాస్పిటల్ వ్యవహారం:**

ఈ భవనానికి సంబంధించి ట్రేడ్ లైసెన్స్ (టిన్: TR08020450002) ప్రకారం విస్తీర్ణం 17,817 చ.అ. ఉండగా, ఆస్తి పన్ను (పిటిన్: 1031300934) రికార్డుల్లో మాత్రం కేవలం 8,857 చ.అ. మాత్రమే ఉంది. దాదాపు 9,080 చదరపు అడుగుల విస్తీర్ణాన్ని పన్ను పరిధి నుంచి తప్పించడం ద్వారా ఏడాదికి సుమారు 12 లక్షల రూపాయల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతోంది.

శాస్త్రీయ ఆధారాలు: ట్రేడ్ వర్సెస్ ప్రాపర్టీ టాక్స్ అక్రమార్కులు పన్ను తప్పించుకోవడానికి అనుసరిస్తున్న శాస్త్రీయ విధానాలను అధికారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

రోడ్డు వెడల్పు మాయాజాలం: డబుల్ రోడ్డుపై ఉన్న భవనాలను సింగిల్ రోడ్డుగా చూపించి పన్ను రేటు (Slab Rate) తగ్గిస్తున్నారు.

యూసేజ్ కన్వర్షన్: పూర్తిస్థాయిలో కమర్షియల్ ఉపయోగిస్తున్న భవనాలను 'రెసిడెన్షియల్'గా చూపించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.




పెనాల్టీల మాఫీ: నిబంధనల ప్రకారం వేయాల్సిన 100% జరిమానాలను అధికారుల లాగిన్ల ద్వారా అక్రమంగా తొలగిస్తున్నారు.

**హద్దులు దాటిన అక్రమ 'లాగిన్లు':**

సరూర్ నగర్ సర్కిల్ అధికారులు తమ పరిధి దాటి హయత్ నగర్ సర్కిల్ లోని ఆస్తులకు కూడా అక్రమంగా అసెస్మెంట్ చేస్తున్నట్లు ఆధారాలు లభించాయి.

మన్సూరాబాద్‌లోని ఓ భవనానికి (నెం: 38 439/1) నిబంధనలకు విరుద్ధంగా కేవలం ఒక గంటలోనే అసెస్మెంట్ పూర్తి చేయడం వ్యవస్థలోని లోపాలకు నిలువుటద్దం. డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, ఏఎంసీ శ్రీనివాసరావుల లాగిన్ల నుంచే ఈ పనులు పూర్తయినా, తమకు తెలియదని బుకాయించడం గమనార్హం.

**ప్రభుత్వానికి సవాల్‌గా మారిన అవినీతి**

తెలంగాణ రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్న తరుణంలో, జీతాలు ఇవ్వడానికే ఇబ్బంది పడుతున్న పరిస్థితిలో ఇలాంటి పన్ను చోరీలు




శాపంగా మారాయి. ఎల్బీనగర్ జోన్ లోని నాలుగు సర్కిళ్లలో (సరూర్ నగర్, ఎల్బీనగర్, హయత్ నగర్, నాగోల్) జరుగుతున్న ఈ స్కామ్ విలువ ఏడాదికి 100 కోట్ల పైచిలుకే అని అంచనా.

**ప్రశ్నలివే.. సమాధానం ఎక్కడ?**

ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు?

చిన్నస్థాయి ఉద్యోగులను కాకుండా ఎ.ఏంసి, డి.సి లను సస్పెండ్ చేయాలి..!

**మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి చర్యలు ఎక్కడ..?**

విజిలెన్స్ మరియు ఏసీబీ అధికారులు ఈ 'వసూల్ రాజా'లపై ఎప్పుడు ఉక్కుపాదం మోపుతారు?

మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి గారు ఈ అక్రమార్కుల చిట్టాపై విచారణకు ఆదేశిస్తారా?

వ్యవస్థలో పేరుకుపోయిన ఈ అవినీతి తిమింగలాలపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే, నిజాయితీగా పన్ను చెల్లించే సామాన్యుడికి ప్రభుత్వంపై నమ్మకం పోవడం ఖాయం.

---




## జేబీ కాలనీ అసోసియేషన్ సభ్యుల ప్రమాణస్వీకారం

ఎల్బీనగర్, మార్చి 01 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ డివిజన్ జింకల బావి కాలనీ నూతన అసోసియేషన్ సభ్యులు ఆదివారం న్యాయవాదులు ఎన్నికల ఆఫీసర్లుగా చట్ట ప్రకారం ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించడం జరిగింది. అసోసియేషన్ ప్రెసిడెంట్ గా టీ. రవీందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గా ఎం. వెంకటేశ్వర్ రావు,, ప్రధాన కార్యదర్శిగా ఎస్. వెంకటేష్ యాదవ్, కోశాధికారిగా కే. మాధవరెడ్డి ప్రమాణస్వీకారం చేశారు.



**వనస్థలిపురం కాపు సంఘ భవన ఆవరణలో స్వర్గీయ వంగవీటి మోహన రంగా కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, వంగవీటి రాధా, కటికరెడ్డి అరవింద్ రెడ్డి, ముద్ద పవన్, సుమంత్, వంగవీటి వంశీ,పలువురు కాపు సంఘం నేతలు, వంగవీటి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.**

**హైదరాబాద్, అక్టోబర్ 31 (భారత శక్తి ):**

## బడంగ్‌పేటలో 'ఆస్తి పన్ను పరిష్కారం' కార్యక్రమం

బడంగ్‌పేట, మార్చి 1 (భారత శక్తి): జీహెచ్ఎంసీ కమిషనర్ మరియు శంషాబాద్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు బడంగ్‌పేట సర్కిల్ కార్యాలయంలో ఆదివారం 'ఆస్తి పన్ను పరిష్కారం' (Property Tax Parishkaram) కార్యక్రమాన్ని నిర్వహించారు. పన్ను చెల్లింపుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించడమే లక్ష్యంగా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు.

**నేడు మూడు ఫిర్యాదులు:**

ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని పలువురు పౌరులు తమ ఆస్తి పన్నుకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం మూడు ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ కార్యాలయ ఉన్నతాధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రతి ఆదివారం అవకాశం:**



ఆస్తి పన్నులో మార్పులు, చేర్పులు లేదా ఇతర సమస్యలు ఉన్న బడంగ్‌పేట నివాసితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ప్రత్యేక కేంద్రం అందుబాటులో ఉంటుందని వారు స్పష్టం చేశారు. మీరు ఈ వార్తతో పాటు ఒక ఫోటోను జోడించాలనుకుంటే, ఆ ఫోటోకు ఈ క్రింది విధంగా క్యాప్షన్ (వివరణ) ఇవ్వవచ్చు: చిత్రం: బడంగ్‌పేట సర్కిల్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆస్తి పన్ను పరిష్కార వేదికలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు.

## పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చేతుల మీదుగా

# తెలంగాణ అడ్డా నూతన కాలమాని ఆవిష్కరణ

*** సబ్ ఎడిటర్ దీమ మహేందర్ సేవలను కొనియాడిన మందకృష్ణ మాదిగ**

కాప్రా, మార్చి 1 (భారత్ శక్తి): తెలంగాణ అడ్డా తెలుగు దిన పత్రిక సంస్థ 2026 సంవత్సర నూతన కాలమాన పట్టికను ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. పత్రిక ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ తెలంగాణ అడ్డా దినపత్రిక ప్రజల సమస్యలను ప్రతిబింబిస్తూ సమాజంలో విశ్వసనీయతను సంపాదించిందని ప్రశంసించారు. బలహీన వర్గాల సమస్యలు, గ్రామీణ ప్రజల కష్టాలు, సామాజిక అన్యాయాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తూ పత్రిక ప్రజల గొంతుకగా నిలుస్తోందని అన్నారు. ప్రజల పక్షాన నిలబడే ధైర్యవంతమైన జర్నలిజం అవసరమని, ఆ దిశగా తెలంగాణ అడ్డా దినపత్రిక చేస్తున్న సేవ అభినందనీయమని పేర్కొన్నారు.




సబ్ ఎడిటర్ దీమ మహేందర్ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే వ్యక్తి అని ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. ప్రజల తరపున అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి వాటి త్వరిత పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల మనిషిగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. జర్నలిజం విలువలను కాపాడుతూ సమాజానికి సేవ చేయడం ప్రశంసనీయమని అన్నారు. మందకృష్ణ మాదిగ తన ప్రసంగంలో సామాజిక న్యాయం కోసం ఎంఆర్పీఎస్ ద్వారా కొనసాగుతున్న ఉద్యమాన్ని కూడా ప్రస్తావించారు. అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం తన పోరాటం కొనసాగుతుందని, సమాన హక్కులు సాధించే వరకు వెనుకడుగు వేయబోనని స్పష్టం చేశారు. యువత సమాజ సేవలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివకుమార్ మాట్లాడుతూ పత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పత్రిక ద్వారా ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి చేరి పరిష్కారం పొందుతున్నాయని అన్నారు. పలువురు నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పత్రిక సిబ్బంది, అభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అతిథులకు నూతన కాలమాన పట్టికలను పంపిణీ చేశారు.

## కుమ్మెర మల్లన్న జాతరలో.... పసి

# కందు మృతిపై అంబేద్కర్ నగర్ లో నిరసన జ్వలలు

*** నిందితులను శిక్షించాలని అంబేద్కర్ నగర్ సబ్బండ వర్గాల క్యాండిల్ ర్యాలీ**

జవహర్ నగర్, ఫిబ్రవరి 1 (భారత్ శక్తి): నాగర్‌కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామంలో వెలసిన మల్లన్న స్వామి జాతరలో చోటుచేసుకున్న అమానుష ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఆలయదర్శనం కోసం వెళ్ళిన రజక కుటుంబంపై జరిగిన రెడ్డిల దాడిలో రెండు నెలల పసికందు మృతి చెందడంపై ప్రజాగ్రహం పెల్లుబికుతోంది. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు సంఘాలు, అంబేద్కర్ నగర్‌లోని బీసీ నేతల ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించాయి. కుమ్మెర గ్రామానికి చెందిన గణేష్, మౌనిక దంపతులు తమ రెండు నెలల కుమార్తెతో కలిసి మల్లన్న స్వామి దర్శనానికి వెళ్ళారు. బాధితుల కథనం ప్రకారం, ఆలయ ప్రవేశం వద్ద కొందరు వ్యక్తులు వారిని కులం పేరుతో దూషించి లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాట మరియు దాడిలో, నిందితులు కాలితో తన్నడంతో తల్లి చేతిలో ఉన్న చిన్నారి కింద పడి తీవ్రంగా గాయపడింది. గాయపడిన పసికందును ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించింది. అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ





నిరసనలో బీసీ సంఘాల నేతలు మాట్లాడుతూ, ఈ ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే హత్య కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి. పోలీసుల నిష్పాక్షిక ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలి. కుటుంబానికి న్యాయం: బాధిత రజక కుటుంబానికి ప్రభుత్వం రూ. 1 కోటి ఎక్స్‌గ్రేషియా మరియు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి. నిందితులపై ఎస్సీ/ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలి. రాజకీయ మరియు సామాజిక స్పందన ఈ ఘటనపై ఇప్పటికే జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్ హెచ్ ఆర్ సి ) మరియు రాష్ట్ర బీసీ కమిషన్ సీరియస్ అయ్యాయి. తీన్మార్ మల్లన్న, బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం ప్రకటించడంతో పాటు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. పోలీసులు ప్రస్తుతం ఈ ఘటనపై లోతైన దర్యాప్తు చేస్తున్నారు. ఒక పసికందు ప్రాణం పోవడానికి కారణమైన కుల వివక్షను సమాజం ఏమాత్రం సహించదు. బాధితులకు న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు. నిరసనకారులు ఈ కార్యక్రమం లోపాల్గొన్నా వారు, మాజీ కార్పొరేటర్ మారగోని నాగరాణి, వెంకటేష్, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ప్రధాన కార్యదర్శి కొలిపాక లక్ష్మన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాంబ రాజ్ కుమార్, టీ ఆర్ ఆర్ ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శాగంటి వెంకటేష్, టీ ఆర్ ఆర్ ఎస్ మేడ్చల్ జిల్లా యూత్ అధ్యక్షులు, పొలాస సాయి కుమార్, టీ ఆర్ ఆర్ ఎస్ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి పొలాస అశోక్, టీ ఆర్ ఆర్ ఎస్ అంబేద్కర్ నగర్ అధ్యక్షులు సి హెచ్ యాదగిరి, మూల సోమయ్య, కూటికంటి వెంకటేష్, అబ్బాగోని రాజ్ గౌడ్, రామకృష్ణ, భాస్కర్, ప్రభాకర్, డా. యాదగిరి, బన్నీ, సైదులు, చెంద్రయ్య, లింగచారి, శోభన్, బిక్షపతి, రమేష్, శ్రీధర్, ఎం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ లో పోలీస్ అధికారుల పదవీ విరమణ



సైబరాబాద్, మార్చి 01 (భారత శక్తి ప్రతినిధి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన నలుగురు పోలీసు సిబ్బందిని ఘనంగా సన్మానించారు. సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ రిటైర్ అయిన సిబ్బందికి పెన్షన్ పత్రాలను అందజేసి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈరోజు పదవీ విరమణ చేసిన వారిలో.. చందానగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ గణపురం శ్యామ్ ప్రసాద్, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ కె. నాగేశ్వర్ రెడ్డి, గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ కొండా సత్యనారాయణ గౌడ్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ చిర్రా సత్యనారాయణ ఉన్నారు. పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు, సహచరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో నిస్వార్థ సేవలు అందించి పదవీ విరమణ పొందుతున్న అధికారుల అనుభవాలను పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. విధి నిర్వహణలో పోలీసులు చేసే త్యాగాల వెనుక వారి కుటుంబ సభ్యుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. భవిష్యత్తులో పోలీస్ శాఖకు అవసరమైనప్పుడు రిటైర్డ్ ఉద్యోగులు వారి సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, అడ్మిన్ ఏడీసీపీ ఎఫ్. రెహ్మాన్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, సీఏఓ అకౌంట్స్ వెంకట్ రెడ్డి, ఏఓ అడ్మిన్ జ్యోతిర్మణి, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్ఐ హిమకర్, సైబరాబాద్ పోలీస్ సహకార సంఘం ఇన్ చార్జ్ జి. మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# అయ్యా... కలెక్టర్ వృద్ధున్ని కనికరించండి

*** పింఛన్ కోసం కిలోమీటర్ మేర నడక**



ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 01 (భారత శక్తి) : సర్కారు ఇచ్చే పింఛన్ కోసం వృద్ధులు నడవలేని స్థితిలో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఇంటికి వెళ్లి పింఛన్ ఇవ్వాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. అయ్యా కలెక్టర్ కనికరించండి పండు ముసలోడిని అంటూ ములుగు జిల్లా వెంకటాపూర్ మం డలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన కత్తుల గట్టుమల్లు (85) సంవత్సరాలకు పైబడిన ఓ వృద్ధుడు పింఛన్ కోసం నరక యాతన పడుతున్నాడు. వృద్ధాప్యం కారణంగా మంచం కే పరిమితమైన సదరు వ్యక్తి నడవలేని స్థితిలో ఉన్నాడు. విధి లేని పరిస్థితిలో పెన్షన్ తీసుకోవడానికి మండుటెండలో కిలోమీటర్లకు పైగా నడుచుకుంటూ వెళ్లి, ఉష్ణోగ్రతవేడికి తట్టుకొనే శక్తి లేక మధ్య మధ్యలో కూర్చుని సేదతీరుతూ పెన్షన్ తీసుకునేందుకు ఆరాటపడుతున్నాడు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ ఇవ్వాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని సంబంధితులపై ఆరోపణలు వినిపి స్తున్నాయి. వృద్ధులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ స్పందించి వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దే పోస్టుమాస్టర్ వెళ్లి పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# సైబరాబాద్‌లో సైబర్ మోసగాళ్ల వేట.. 8 కేసులు ఛేదన.. 11 మంది అరెస్ట్

సైబరాబాద్, మార్చి 01 (భారత శక్తి ప్రతినిధి): సైబర్ నేరగాళ్ల పట్ల రాజీలేని పోరాటం కొనసాగిస్తున్నామని, గత వారం రోజుల్లోనే 8 కీలక కేసులను ఛేదించి దేశంలోని పలు రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 11 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్ వెల్లడించారు. ఫిబ్రవరి 20 నుండి 26 వరకు జరిపిన ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా 9 మందిని ట్రేడింగ్ మోసాలకు, మరో ఇద్దరిని లోన్ మోసాలకు సంబంధించి అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. బాధితులకు ఉపశమనం కలిగించేలా 117 కేసుల్లో మొత్తం 564 రిఫండ్ ఆర్డర్లు పొందామని, తద్వారా సుమారు రూ. 1,62,34,413 మొత్తాన్ని బాధితులకు తిరిగి చెల్లించే ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. ముఖ్యంగా మహారాష్ట్రలోని పుణే నగరంలో అర్జున్ కుమార్ శర్మ అనే నిందితుడిని అరెస్ట్ చేయడం ద్వారా రూ. 1.16 కోట్ల భారీ ట్రేడింగ్ మోసాన్ని ఛేదించామని డీసీపీ తెలిపారు. నిందితులు "మోనార్క్ నెట్‌వర్త్ క్యాపిటల్" సంస్థతో సంబంధం ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తూ, "మోనార్క్ ఫైనాన్స్" పేరుతో ఒక నకిలీ యాప్‌ను సృష్టించారు. బాధితులను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆకర్షించి, 300 శాతం లాభాల హామీతో పెట్టుబడులు పెట్టించి అపహరించినట్లు గుర్తించారు. నిందితుడు అర్జున్ కుమార్ శర్మ కమీషన్ కోసం కరెంట్ బ్యాంక్ ఖాతాలను తెరిచి, వాటి పూర్తి యాక్సెస్‌ను సైబర్ మోసగాళ్లకు అప్పగించినట్లు విచారణలో వెల్లడైందని ఆయన పేర్కొన్నారు. నేరగాళ్ల వ్యూహం గురించి వివరిస్తూ వీరు సోషల్ మీడియాలో ప్రముఖ ఆర్థిక సంస్థల పేరుతో తప్పుడు ప్రకటనలు ఇచ్చి బాధితులను వాట్సాప్ గ్రూపుల్లో చేరుస్తారని డీసీపీ హెచ్చరించారు. అప్పర్ సర్క్యూట్ ట్రేడ్లు, ఐపీఓ కేటాయింపుల పేరుతో నకిలీ స్క్రీన్‌షాట్లు చూపిస్తూ నమ్మకం కలిగిస్తారు. మొదట చిన్న మొత్తాలను ఉపసంహరించుకునేలా చేసి విశ్వాసం పెంచుతారని, ఆపై పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాక కమిషన్ లేదా ప్రాసెసింగ్ ఫీజుల పేరుతో అదనపు డబ్బు డిమాండ్ చేస్తూ బాధితుల ఖాతాలను బ్లాక్ చేస్తారని వివరించారు. మోసపోయిన నిధులన్నీ వివిధ మ్యూల్ బ్యాంక్ ఖాతాల ద్వారా మళ్లిస్తున్నట్లు తమ పరిశోధనలో తేలిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేస్తూ.. అధిక లాభాల హామీ ఇచ్చే సోషల్ మీడియా ప్రకటనలు, వాట్సాప్ గ్రూపులను నమ్మవద్దని డీసీపీ కోరారు. ఏదైనా సంస్థలో పెట్టుబడి పెట్టే ముందు అది సెబీలో రిజిస్ట్రేషన్ పొందిందో లేదో ఖచ్చితంగా నిర్ధారించుకోవాలని సూచించారు. వ్యక్తిగత లేదా తెలియని కరెంట్ ఖాతాలకు డబ్బులు బదిలీ చేయవద్దని, లాభాల ఉపసంహరణ కోసం ఎప్పుడూ ముందుగా డబ్బు చెల్లించవద్దని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లు గుర్తిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

**: మంత్రి సీతక్క.**



ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 01 (భారత శక్తి) : అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు, ప్రజా ప్రభుత్వం పేదవారికి కలలను సాకారం చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం ఏటూరు నాగారం మండలం కేంద్రంలోని ఎస్ ఎల్ ఎన్ గార్డెన్ ఫంక్షన్ లో మంత్రి దనసరి అనసూయ సీతక్క , జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., తో కలిసి ఏటూరు నాగారం మండలం కొండాయి గ్రామానికి చెందిన 90 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను, ఏటూరు నాగారం మండలనికి చెందిన 38 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని పేదవాడి కలను సకారం చేయడానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, మంజూరు చేసిన ఇండ్లను లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణం పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. కొండాయి గ్రామంలో పార్టీలకు అతీతంగా 90 మందికి ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని, 16 కోట్ల రూపాయల నిధులతో పటిష్టంగా అత్యంత నాణ్యత ప్రమాణాలతో వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మహిళా సంఘం లో సభ్యురాలుగా ఉంటే ఇంటి నిర్మాణానికి తక్షణమే లక్ష రూపాయల రుణాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. కొండాయి గ్రామం జంపన్న వాగు పరివాహక ప్రాంతంలో ఉన్నందున మంజూరు అయిన ఇండ్లను సురక్షిత ప్రాంతంలో నిర్మించుకోవాలని లబ్ధిదారులకు మంత్రి సూచించారు. ప్రభుత్వం ములుగు ప్రాంతాన్ని గతంలో ఎన్నడూ లేనటువంటి విధంగా సంక్షేమ పథకాలకు అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఈ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం ఏటూరు నాగారం మండలానికి చెందిన 38 మంది లబ్ధిదారులకు మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ తో కలిసి కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని ఎవరైనా బాల్యవివాహాలు చేయడానికి, చేసుకోవడానికి సిద్ధపడిన జైలు శిక్షతో పాటు కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి,డి పి ఓ వెంకయ్య, హౌసింగ్ పీడీ ఎస్.సూర్యనారాయణ, ఎంపీడీవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మల్లూరు దేవాలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తాం

**: మంత్రి శ్రీనివాస్ రెడ్డి**





ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 01 (భారత శక్తి) : మల్లూరు దేవాలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తాం అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం మంగపేట మండలం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి చేరుకున్న రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు, పినపాక శాసన సభ సభ్యులు పాయం వెంకటేశ్వర్లు గార్లకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో, డోలు వాయిద్యాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి శ్రీనివాస రెడ్డి, మంత్రి సీతక్క, ఎంపి బలరాం నాయక్, పినపాక, భద్రాచలం, శాసన సభ సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు లతో కలిసి దర్శించుకొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు మంత్రులకు, శాసన సభ సభ్యులకు ఆలయ విశిష్టతను కులకషంగా వివరించి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మీడియా తో మాట్లాడుతూ మల్లూరు గుట్టలో స్వయంభుగా వెలసిన హేమాచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. మల్లూరు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి విశిష్ట ప్రాముఖ్యత కలిగి ఉందని దశాబ్దాల కాలం నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి వారి దర్శనం కోసం రావటం జరుగుతుందని భక్తులు కోరిన కోర్కెలు తీరుస్తారనే పూర్తి విశ్వాసం తో భక్తులు వస్తుంటారని అన్నారు. ములుగు ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన పర్యాటక కేంద్రాలు నెలవై ఉన్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి , ప్రజా ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా మేడారం జాతరను అద్భుతంగా 200 సంవత్సరాల వరకు చెక్కుచెదరకుండా ఉండే విధంగా అభివృద్ధి చేసుకొని, మహా జాతరను గత నెల చివరిలో విజయవంతం చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా గోదావరి పరివాహక ప్రాంతాల్లోని దేవాలయాలను బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని వాటికి సంబంధించిన పనులు కూడా త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందని స్పష్టం చేశారు. స్థానిక మంత్రి సీతక్క కోరిక మేరకు దేవాలయాన్ని అద్భుతంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసి చూపిస్తుందని, అన్ని మతాల భక్తుల మనోభావాలను, అభిప్రాయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుంది వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, ఎస్ పి సుధీర్ రామనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఈ ఓ మహేష్, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మెన్ సురేశ్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ లు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం అభినందనీయం

**: వెన్నెల ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నరేష్ మామిడి**



సూర్యాపేట, మార్చి 01 (భారత శక్తి ప్రతినిధి): జర్నలిస్ట్ లు వెన్నెల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమని వెన్నెల ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నరేష్ మామిడి, వైదురాలు దివ్య, ఆసుపత్రి నిర్వాహకులు బయ్య దయాకర్ లు అన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు సంబంధించి ఈసీజీ, బీపీ, షుగర్, ఊపిరితిత్తులకు సంబంధించిన ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని జిల్లా కేంద్రంలోని బాలుర హైస్కూల్లో ఆదివారం వారు ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో ప్రభుత్వాలు మార్చే శక్తి జర్నలిస్టులకు ఉందని, నిరంతరం వార్తా న్యూస్ కవరేజ్ కొరకు వెళుతుంటారని కాబట్టి ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలను స్క్రీనింగ్ చేస్తే ఆరోగ్య సమస్యలను గుర్తించి నయం చేసే ఛాన్స్ ఉంటుందని తెలిపారు. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సహకరించిన జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. టి యు డబ్ల్యూ జె, ఐజెయు జాతీయ కౌన్సిల్ సభ్యులు మిక్కిలినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ యూనియన్లకు అతీతంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయటం శుభపరిణామమని అన్నారు. టి యు డబ్ల్యూజె ఐజెయు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కృష్ణ బంటు మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా ఎలాంటి వేతనాలు లేకున్న జీవితాలను పణంగా పెట్టి ప్రభుత్వం ప్రజల మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల కు వెన్నెల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం ఆసుపత్రి నిర్వాహకులకు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండే జర్నలిస్టులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి మంచి ఫిట్నెస్ కలిగి ఉండాలని కోరారు. టీఎస్ జెఏ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి యాదగిరి మాట్లాడుతూ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా 24 గంటలు ప్రజా సమస్యలే ధ్యేయంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు వైద్య శిబిరం ఏర్పాటు మంచి ఆలోచన అని తెలిపారు. కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జే 143 జిల్లా అధ్యక్షుడు వజ్జె వీరయ్య యాదవ్, సీనియర్ జర్నలిస్టు, జహంగీర్ సీనియర్ జర్నలిస్టులు శ్రీనివాసరెడ్డి, బచ్చు పురుషోత్తం, వెంకట్ రెడ్డి, ఉయ్యాల నరసయ్య గౌడ్, గుంటి శ్రీను, పెనుగొండ మల్లికార్జున్, కొండ్లె కృష్ణయ్య, తండు వెంకన్న గౌడ్, దోసపాటి అజయ్ కుమార్, వాసా చంద్రశేఖర్, జహీర్, శ్రీనివాస్, సుమన్, రమేష్, సూర్య,వెన్నెల ఆస్పత్రి సిబ్బంది నాగరాజు, మధు,చైతన్య, రియాజ్, రేష్మ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు ఉచిత వైద్య సేవలను అందించినందుకు డాక్టర్లను ఘనంగా సన్మానించారు. జర్నలిస్టులు ఎవరికైనా వెన్నెల ఆసుపత్రిలో ఓపి ఫీజు లేకుండా ఉచితంగా చూస్తామని డాక్టర్ నరేష్ నిర్వాకులు దయాకర్ హామీ ఇచ్చారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.

# సీఎం ప్రజావాణికి రెండేళ్లు.. 47 వేల దరఖాస్తులు పరిష్కారం

హైదరాబాద్, మార్చి 01 (భారత శక్తి ప్రతినిధి): ముఖ్యమంత్రి ప్రజావాణి ప్రజల సమస్యల పరిష్కార వేదికగా నిలుస్తోంది. సమస్యలు వేగవంతంగా పరిష్కారం అవుతుండడంతో రాష్ట్రం నలువైపుల నుంచి ప్రజలు భారీ ఎత్తున రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణికి తరలివస్తున్నారు. రెండేళ్ల క్రితంప్రారంభమైన సీఎం ప్రజావాణి ప్రతి వారంలో మంగళ, శుక్రవారాలలో జరిగే ఈ కార్యక్రమం ఇప్పటివరకు 24 సెషన్స్ పూర్తి చేసుకుంది. రెండేళ్ల కాలంలో సీఎం ప్రజావాణిలో మొత్తం ఒక లక్షా 12 వేల 245 దరఖాస్తులు నమోదు కాగా అందులో 64,558 దరఖాస్తులు పరిగణలోకి తీసుకొని 47,935 దరఖాస్తులు పరిష్కరించారు. మిగతా 47,687 దరఖాస్తులు ప్రభుత్వ పథకాలు, విధానపరమైన ప్రభుత్వ నిర్ణయాలు తీసుకోవాల్సినవి కావడం, ఉద్యోగాల కోసం సంబంధించినవి ఉన్నాయి. వీటిని పరిష్కరించాలని కోరుతూ సంబంధిత శాఖలకు సిఫార్సు చేశారు. సీఎం ప్రజావాణికి వచ్చే దరఖాస్తుల పరిష్కారం 74 శాతం మేరకు ఉండడంతో ప్రజల నుంచి భారీ స్పందన వస్తోంది. సీఎం ప్రజావాణి పై ప్రజల్లో భరోసా పెరిగింది. దీంతో వారంలో రెండు రోజులు మంగళ, శుక్రవారాలలో సుమారు వేయి దరఖాస్తులు నమోదు అవుతున్నాయి.

**చిన్నారెడ్డి బాధ్యతలు చేపట్టి రెండేళ్లు..**

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి సీఎం ప్రజావాణి ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టి సరిగ్గా ఆదివారానికి రెండేళ్లు పూర్తి అవుతోంది. సీఎం ప్రజావాణికి వచ్చే ప్రజల నుంచి దరఖాస్తులు స్వయంగా స్వీకరించి ఓపికతో సమస్యలు విని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి దరఖాస్తుపై ఎండార్స్‌మెంట్ చేసి చిన్నారెడ్డి స్వయంగా స్టాంప్ వేస్తుండడం విశేషం. ఈ ప్రక్రియ ప్రజల్లో విశ్వాసాన్ని నింపుతోంది. నిరంతరం వారంలో రెండు రోజులు ఇదే తరహా ప్రక్రియతో పాటు ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్ ద్వారా సంబంధిత శాఖకు సిఫార్సు చేస్తుండడం వల్ల సమస్యలు సత్వరంగా పరిష్కారం అవుతున్నాయి.

*** ప్రతి శాఖ నుంచి అధికారులతో ప్రత్యేక డెస్కులు**

గల్ఫ్‌లోని ఏడు దేశాలు సహా ఇతర దేశాలలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీఎం ప్రవాసి ప్రజావాణి కేంద్రాన్ని కూడా ఈ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సీఎం ప్రజావాణిలో దరఖాస్తులు రాసి ఇచ్చేందుకు హెల్ప్ డెస్క్, ప్రతి శాఖ నుంచి అధికారులతో ప్రత్యేక డెస్కులు, వైద్య సహాయం కోసం మెడికల్ క్యాంపు, వృద్ధులు దివ్యాంగుల రవాణా కోసం బ్యాటరీ బగ్గి, వీల్ చైర్స్, అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్, ప్రజలకు మంచినీటి సౌకర్యం, జీహెచ్ఎంసీ ఆర్థిక సహకారంతో హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా ఐదు రూపాయల భోజనం వంటివి సీఎం ప్రజావాణిలో కల్పించారు.

*** ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర**

సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ కూడా ఎంతో ఓపికతో ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాసు పుస్తకాల సమస్యలు పరిష్కరించడం, పబ్లిక్ సర్వీస్ కమిషన్ వివిధ గ్రూపుల పరీక్షలు, వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ రిక్రూట్‌మెంట్‌లలో జాప్యం, ఫలితాల విడుదల వంటి అంశాలు, రైతుల వ్యవసాయ సంబంధిత సమస్యలు, విద్యుత్ సమస్యలు, ప్రజల ఆరోగ్య సమస్యలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ళు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యలు, ఆర్టీసీ కార్మికులు, గల్ఫ్ కార్మికుల సమస్యలు వంటి అనేక అంశాలు సీఎం ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణి ద్వారా పరిష్కారమవుతున్నాయి. సీఎం ప్రజావాణి సక్సెస్ కార్యమాన్ని వివిధ రాష్ట్రాలకు చెందిన ట్రైనీ ఐఏఎస్‌లు, గ్రూప్ 1 అధికారులు పరిశీలించారు. సీఎం ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో డాక్టర్ చిన్నారెడ్డి, దివ్యదేవరాజన్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నందు వల్ల పరిష్కారం 74 శాతంగా ఉంది. రానున్న రోజుల్లో పరిష్కార శాతాన్ని మరింత మెరుగు పర్చేందుకు అన్ని చర్యలు తీసుకోనున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు.

## మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు...
## తెలుగువారికి సీఎం రేవంత్ రెడ్డి సూచన

హైదరాబాద్, మార్చి 01 (భారత శక్తి ప్రతినిధి): గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, అక్కడ నివసిస్తున్న తెలుగు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. యుద్ధ మేఘాలు అలుముకుంటున్న వేళ.. ప్రజల భద్రతే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. ఇరాన్‌తో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లోని పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అక్కడి తెలుగువారు భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే హెచ్చరికలు, భద్రతా సూచనలను తప్పకుండా పాటించాలని కోరారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే.. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని పౌరులను క్షేమంగా వెనక్కి రప్పించేందుకు రాష్ట్ర యంత్రాంగం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు అక్కడి ఎంబసీలతో టచ్‌లో ఉండాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, బహ్రెయిన్‌లోని తెలుగువారి భద్రతపై ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆరా తీశారు. ఇరాన్ దాడుల నేపథ్యంలో బహ్రెయిన్‌లో ఆందోళన నెలకొంది. అక్కడ సుమారు 50 వేల మంది ఏపీ వాసులు ఉపాధి పొందుతుండగా, వారిలో అయ్యన్న సొంత నియోజకవర్గమైన నర్సీపట్నం వారే అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ క్రమంలో అక్కడి తెలుగువారితో ఫోన్‌లో మాట్లాడిన స్పీకర్.. ధైర్యంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని సూచించారు. ఆపద సమయంలో ఏపీఎన్ఆర్‌టీఎస్ ద్వారా సాయం చేసేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అయ్యన్న తెలిపారు. పరిస్థితి విషమిస్తే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో మాట్లాడి..తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

## పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు... ఇండిగో 350 సర్వీసులు రద్దు

పశ్చిమ ఆసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు అంతర్జాతీయ విమానయాన రంగాన్ని కుదిపేస్తున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పెరుగుతున్న సైనిక ఘర్షణల కారణంగా పశ్చిమ ఆసియా గగనతలాన్ని మూసివేయడంతో ప్రపంచవ్యాప్తంగా విమాన రాకపోకలు స్తంభించాయి. ఆదివారం నాటికి భద్రతా కారణాల దృష్ట్యా సుమారు 700కు పైగా విమాన సర్వీసులు రద్దయినట్లు విమానయాన వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరికొన్ని విమానాలను సురక్షిత ప్రాంతాల మీదుగా దారి మళ్లించారు. అంతర్జాతీయ విమానయానానికి కీలకమైన పశ్చిమ ఆసియా గగనతలంపై ఆంక్షలు విధించడంతో ఆసియా, యూరప్, ఉత్తర అమెరికా మధ్య నడిచే విమానాలపై తీవ్ర ప్రభావం పడింది. దుబాయ్, అబుదాబి, దోహా వంటి ప్రధాన గల్ఫ్ హబ్‌లలో విమాన సర్వీసుల షెడ్యూళ్లు తారుమారయ్యాయి. ఇరాన్, ఇజ్రాయెల్ గగనతలంపై ఆంక్షలు ఉండటంతో విమానయాన సంస్థలు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ దేశాల మీదుగా రాకపోకలు సాగించే భారతీయ విమానయాన సంస్థలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. ప్రముఖ సంస్థ ఇండిగో రానున్న మూడు రోజుల వ్యవధిలో ఏకంగా 350కి పైగా విమానాలను రద్దు చేసింది. మార్చి 1న 166, మార్చి 2న 162, మార్చి 3న 43 విమానాలను రద్దు చేసినట్లు సమాచారం. ఇది ఆ సంస్థ సాధారణ ఆపరేషన్లలో సుమారు 7 నుంచి 8 శాతంగా ఉంది. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కూడా భద్రతా సూచనల మేరకు పలు సర్వీసులను రద్దు లేదా దారి మళ్లించాయి. ప్రపంచవ్యాప్తంగా ఎమిరేట్స్, లుఫ్తాన్సా వంటి దిగ్గజ సంస్థలు కూడా తమ షెడ్యూళ్లను మార్చుకున్నాయి. యుద్ధ ప్రభావిత ప్రాంతాలను తప్పించి, సుదీర్ఘమైన రూట్లలో విమానాలను నడుపుతుండటంతో ప్రయాణ సమయంతో పాటు ఇంధన వినియోగం భారీగా పెరిగింది. ఇది ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విమానయాన రంగానికి అదనపు భారంగా మారింది. పరిస్థితి సద్దుమణిగితే తప్ప విమాన సర్వీసులు సాధారణ స్థితికి వచ్చే అవకాశం లేదని నిపుణులు అంటున్నారు.

## అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సైన్యాధిపతి మౌసవి మృతి

ఇరాన్, మార్చి 01: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన సంయుక్త వైమానిక దాడులు ఆ దేశానికి కోలుకోలేని దెబ్బతీశాయి. ఈ దాడుల్లో ఇరాన్ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అబ్దోల్లాహిం మౌసవి మరణించినట్లు ఆ దేశ ప్రభుత్వ మీడియా ఐఆర్ఐబీ టీవీ ఆదివారం వెల్లడించింది. జిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం.. టెహ్రాన్‌పై జరిగిన ఈ భీకర దాడుల్లో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) చీఫ్ కమాండర్ మొహమ్మద్ పాక్‌పూర్, రక్షణ మండలి కార్యదర్శి అలీ షంఖానీ, రక్షణ మంత్రి అజీజ్ నసిర్‌జాదే కూడా ప్రాణాలు కోల్పోయారు. టెహ్రాన్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఇరాన్ ఉన్నతాధికారులు సమావేశమైనట్లు మిలిటరీ ఇంటెలిజెన్స్ గుర్తించిందని, ఆ వెంటనే ఇజ్రాయెల్ ఎయిర్ ఫోర్స్ మెరుపు దాడులు చేసిందని ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) ప్రకటించింది. ఈ ఆపరేషన్‌లో రక్షణ మంత్రి, ఐఆర్‌జీసీ చీఫ్ సహా మొత్తం ఏడుగురు సీనియర్ కమాండర్లను మట్టుబెట్టినట్లు ఐడీఎఫ్ స్పష్టం చేసింది. మరికొంతమంది బాధితుల వివరాలు వెల్లడికావాల్సి ఉందని స్థానిక మీడియా పేర్కొంది. మరోవైపు, ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతి చెందినట్లు ఆ దేశ ప్రభుత్వ టీవీ అధికారికంగా ధృవీకరించింది. తమ నాయకుడి మరణంపై ఐఆర్‌జీసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఖమేనీ మరణానికి కారణమైన అమెరికా, ఇజ్రాయెల్ "హంతకులపై" ప్రతీకారం తీర్చుకుంటామని టెలిగ్రామ్ వేదికగా శపథం చేసింది. చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా అత్యంత భీకరమైన దాడులతో (ఫెరోషియస్ అఫెన్సివ్) సమాధానం చెబుతామని, తమ దేశంపై దాడి చేసిన వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించింది. ఈ పరిణామాలతో పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి.

## ఈ హత్య కిరాతకమైన చర్య...
## ఖమేనీ మరణంపై ఘాటుగా స్పందించిన పుతిన్

రష్యా, మార్చి 01: ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రంగా స్పందించారు. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ఖమేనీ ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని 'సినికల్ మర్డర్' (కిరాతక హత్య)గా అభివర్ణించిన పుతిన్.. ఇది అంతర్జాతీయ చట్టాలను, మానవత్వాన్ని పూర్తిగా ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఈ మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌కు పుతిన్ ఓ లేఖ రాశారు. ఖమేనీని రష్యాలో అత్యుత్తమ రాజనీతిజ్ఞుడిగా గుర్తుంచుకుంటామని, ఇరు దేశాల సంబంధాల బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారని ఆ లేఖలో కొనియాడారు. శనివారం జరిగిన ఈ దాడుల్లో ఖమేనీతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, పలువురు సీనియర్ సైనిక అధికారులు మరణించినట్లు ఇరాన్ మీడియా ధృవీకరించింది. ఈ ఘటనతో ఇరాన్ 40 రోజుల పాటు సంతాప దినాలను ప్రకటించింది. తమ నాయకుడి మరణానికి ప్రతీకారం తీర్చుకోవడం తమ చట్టబద్ధమైన హక్కు, బాధ్యత అని ఇరాన్ స్పష్టం చేసింది. మరోవైపు ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుండటంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ అధినేతలు స్పందిస్తూ.. అమెరికా ఇరాన్ మధ్య చర్చలు జరగాలని సూచించారు. ఖమేనీ మరణం ప్రపంచ రాజకీయాల్లో, ముఖ్యంగా రష్యాఇరాన్ సంబంధాల్లో కీలక మార్పులకు కారణం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటు చేయండి

అమరావతి, మార్చి 01 (భారత శక్తి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ప్రతిష్టాత్మక నేషనల్ జ్యుడిషియల్ అకాడమీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను కోరారు. అమరావతిలో నిర్మిస్తున్న 'జస్టిస్ సిటీ'ని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, దీనికి న్యాయ వ్యవస్థ సహకారం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఆదివారం విజయవాడలో ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో 'మధ్యవర్తిత్వం'పై జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు సీఎం చంద్రబాబు, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ.. రాజధాని నిర్మాణంలో భాగంగా జస్టిస్ సిటీలో న్యాయ వ్యవస్థకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు వివరించారు. కేవలం కోర్టు భవనాలే కాకుండా.. జ్యుడిషియల్ అకాడమీ, లీగల్ సర్వీసెస్ అథారిటీ, మీడియేషన్ సెంటర్, ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి కీలక విభాగాలన్నింటినీ ఒకే చోట అనుసంధానిస్తూ (ఇంటిగ్రేట్) బెస్ట్ జ్యుడిషియల్ సిటీని నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ సంస్థల ఏర్పాటుకు అవసరమైన భూములను కేటాయించేందుకు, ఇతరత్రా పూర్తి సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీజేఐకి భరోసా ఇచ్చారు.

**మధ్యవర్తిత్వానికి ఆర్థిక ప్రోత్సాహం**

సమాజంలో మధ్యవర్తిత్వం ద్వారా సత్వర న్యాయం అందాల్సిన ఆవశ్యకతను సీఎం నొక్కిచెప్పారు. గతంలో గ్రామాల్లో పెద్దమనుషుల సమక్షంలో చాలా సమస్యలు పరిష్కారమయ్యేవని, తన తండ్రి కూడా గ్రామంలో ఇలాంటి పెద్దరికం వహించి ఎన్నో వివాదాలను పరిష్కరించారని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. ఈ విధానాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసు పరిష్కారమైతే రూ.10 వేలు, ఒకవేళ పరిష్కారం కాకపోయినా ఆ ప్రక్రియలో పాల్గొన్నందుకు రూ.3 వేలు అందిస్తామని ప్రకటించారు. న్యాయం త్వరగా జరిగితేనే అభివృద్ధి వేగవంతం అవుతుందని, అందుకే ఇలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వడం ప్రభుత్వానికి భారం కాదని అభిప్రాయపడ్డారు.

**బ్లూ-గ్రీన్ సిటీగా అమరావతి**

దేశంలోనే ఎక్కడా లేని విధంగా అమరావతిని బ్లూ గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం తెలిపారు. 29,000 మందికి పైగా రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు ఇవ్వడం చారిత్రక ఘట్టమని కొనియాడారు. ప్రజల అవసరాలు, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక బలం కలగలిసిన నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఆ 5 గ్రామాలను తెలంగాణకు ఇచ్చేయండి
## చంద్రబాబుకు సీపీఐ నారాయణ విజ్ఞప్తి


* **ఈ ప్రతిపాదనకు చంద్రబాబు మానవత్వంతో అంగీకరించాలి**
* **భద్రాద్రి ఆలయానికి కనీస సౌకర్యాలు లేవని వ్యాఖ్య**
* **సామరస్యంగా సమస్యను ముగించాలని సూచన**



హైదరాబాద్, మార్చి 01 (భారత శక్తి ప్రతినిధి): భద్రాచలం సమీపంలో ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణకు అప్పగించాలనే ప్రతిపాదనకు సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె. నారాయణ మద్దతు తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానవతా దృక్పథంతో ఆలోచించి, సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో నారాయణ విలేకరులతో మాట్లాడారు. ఇటీవల తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎం చంద్రబాబును కలిసి ఐదు గ్రామాలను తెలంగాణకు ఇవ్వాలని కోరారని, ఈ ప్రతిపాదన సమంజసంగా ఉందని నారాయణ అన్నారు. "భద్రాద్రి చుట్టుపక్కల ఉన్న ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణకు ఇవ్వడం ద్వారా మంచి పని చేసినట్టు అవుతుంది. ఈ ప్రతిపాదన న్యాయంగా ఉందని భావిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. భద్రాచలం దేవాలయం చాలా పెద్దదని, కానీ ఆలయంలోని చెత్తను పడేయడానికి కూడా స్థలం లేని దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామివారి విహార యాత్రకు కూడా వీలు లేకుండా పోయిందని అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం తెలంగాణలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు ఈ ఐదు గ్రామాల విషయంలో పట్టుదలకు పోకుండా, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని నారాయణ సూచించారు.

## లెబనాన్‌లోని భారతీయులకు అత్యవసర హెచ్చరిక
## ప్రయాణాలు మానుకోవాలని ఎంబసీ సూచన

ఢిల్లీ, మార్చి 01 (భారత శక్తి ప్రతినిధి): ఇరాన్ పై ఇజ్రాయెల్అమెరికా దాడులతో మధ్యప్రాచ్యంలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో, లెబనాన్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులను అప్రమత్తం చేసింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా, భారతీయులు అనవసర ప్రయాణాలను మానుకోవాలని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ స్థానిక యంత్రాంగం జారీ చేసే భద్రతా సూచనలను కచ్చితంగా పాటించాలని ఆదివారం ఒక ప్రకటనలో సూచించింది. లెబనాన్‌లోని భారతీయులు ఎవరైనా అత్యవసర సహాయం కోసం ఎంబసీని సంప్రదించవచ్చని తెలిపింది. ఇందుకోసం 96176860128 మొబైల్ నంబర్ లేదా cons.beirut@mea.gov.in మెయిల్ ఐడీని అందుబాటులో ఉంచింది.



ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఈ నంబర్లను సంప్రదించాలని కోరింది. మరోవైపు... ఇరాన్, గల్ఫ్ ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలను పెంచకుండా సమస్యలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని భారత విదేశాంగ శాఖ కోరింది. పౌరుల భద్రతకే అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. కేవలం లెబనాన్ మాత్రమే కాకుండా.. ఇరాన్, ఖతార్, యూఏఈ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు కూడా అక్కడి భారతీయులకు హెచ్చరికలు జారీ చేశాయి. ఇరాన్‌లోని భారతీయులు సాధ్యమైనంత వరకు ఇళ్లలోనే ఉండాలని, అనవసరంగా బయట తిరగవద్దని టెహ్రాన్‌లోని ఎంబసీ సూచించింది. ఖతార్, యూఏఈలలో కూడా భారతీయులు స్థానిక అధికారుల హెచ్చరికలు గమనిస్తూ, సైనిక స్థావరాలకు దూరంగా ఉండాలని ఆయా ఎంబసీలు స్పష్టం చేశాయి. ఆయా ప్రాంతాల్లోని మిషన్లు భారతీయులతో నిరంతరం టచ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు.

# మూసీ ముసుగులో విధ్వంసం వద్దు: కేటీఆర్




హైదరాబాద్, మార్చి 01 (భారతశక్తి): మూసీ సుందరీకరణ పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఆస్తులను ధ్వంసం చేయాలని చూస్తే సహించేది లేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు హెచ్చరించారు. శనివారం రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని హైదర్‌షాకోట్ నుంచి మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ల వరకు ఆయన పాదయాత్ర నిర్వహించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్కింగ్ నోటీసులతో ఆందోళన చెందుతున్న బాధితులకు సంఘీభావం ప్రకటించారు.

**భయం వద్దు.. పోరాటం మనదే!**

ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ నివాసితులతో కేటీఆర్ ముఖాముఖి మాట్లాడారు.

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల వేలాది కుటుంబాలు వీధిన పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. "చట్టబద్ధంగా అనుమతులు పొంది నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేస్తామంటే ఊరుకోం. రేవంత్ సర్కార్ బెదిరింపులకు ఎవరూ భయపడవద్దు. బాధితుల పక్షాన బీఆర్ఎస్ అండగా ఉంటుంది" అని ఆయన భరోసా ఇచ్చారు. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా మొండిగా ముందుకెళ్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు.

**రంగంలోకి ముఖ్య నేతలు:**

ఈ పాదయాత్రలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ స్వామి గౌడ్, ఎమ్మెల్సీలు శంబుపూర్ రాజు, దాసోజు శ్రవణ్, రాజేంద్రనగర్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మూసీ ప్రాజెక్టు రీడిజైనింగ్ పేరుతో జరుగుతున్న పరిణామాలపై క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు.

**మూసీ సుందరీకరణ - క్షేత్రస్థాయి సవాళ్లు**


ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం సుమారు 55 కిలోమీటర్ల మేర మూసీ నదిని పునరుద్ధరించాల్సి ఉంది. అయితే, ఈ ప్రక్రియలో ఎదురవుతున్న ప్రధాన అడ్డంకులు ఇవే:

అనుమతుల చిక్కులు: ప్రస్తుతం మార్కింగ్ చేస్తున్న అనేక ఇళ్లకు గతంలోనే హెచ్ఎండీఏ (HMDA) లేదా మున్సిపల్ అధికారులు అనుమతులు ఇచ్చారు. ఇప్పుడు వాటిని అక్రమ కట్టడాలుగా పరిగణించడంపై న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంది.

బఫర్ జోన్ వర్గీకరణ: నది పరివాహక ప్రాంతాల్లో 30 మీటర్ల బఫర్ జోన్ నిబంధనను పాత నిర్మాణాలకు వర్తింపజేయడం వల్ల వేలాది అపార్ట్‌మెంట్లు ప్రభావితమవుతున్నాయి.

ఆర్థిక భారం: కేవలం సుందరీకరణ కోసమే భారీ మొత్తంలో పరిహారం చెల్లించడం ప్రభుత్వానికి సవాలుగా మారనుంది.

ప్రభుత్వం మొండి పట్టు వీడి, బాధితులతో చర్చలు జరిపి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు.



## అల్కాపురిలో 'నట్స్ స్పైస్.కామ్' ప్రారంభం



ఎల్బీనగర్, ఫిబ్రవరి 1 (భారతశక్తి) : ఆర్కేపురం డివిజన్ పరిధిలోని అల్కాపురి కాలనీలో ఆదివారం 'నట్స్ స్పైస్.కామ్' ఆర్గానిక్ ప్రొడక్ట్స్ షాపును డివిజన్ నాయకురాలు పున్న నిర్మల గణేష్ నేత ప్రారంభించారు. దేశంలోని వివిధ ప్రాంతాల రైతుల నుంచి నేరుగా సేకరించిన డ్రై ఫ్రూట్స్, తులసి తేనె, నట్స్, బెర్రీస్, మిల్లెట్ ఉత్పత్తులను ఈ స్టోర్‌లో అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ.. సాంప్రదాయ రుచులతో కూడిన నాణ్యమైన ఉత్పత్తులను హోల్ సేల్, రిటైల్ ధరలకే స్థానిక ప్రజలకు అందించాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, స్టోర్ యజమానులు విజయ్, శశికుమార్, స్రవంతి, సంతోషి మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## అనంతుల జంగారెడ్డి కాలనీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

* **ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌డీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి**

ఎల్బీనగర్, మార్చి 1 (భారత శక్తి) : ఎల్బీనగర్ నియోజకవర్గం నాగోల్ డివిజన్ పరిధిలోని అనంతుల జంగారెడ్డి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఆర్‌డీసీ) చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

* **కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది:**

ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో





రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, నియోజకవర్గంలోని ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా మూసీ సుందరీకరణ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**నూతన కార్యవర్గానికి సన్మానం:**

అనంతరం కాలనీ నూతన అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, మాజీ అధ్యక్షులు భాస్కర్, ఉపాధ్యక్షులు రంగారెడ్డి, జనరల్ సెక్రటరీ వెంకటేష్ గౌడ్, జాయింట్ సెక్రటరీ డా. చందు సహా కార్యవర్గ సభ్యులను మల్‌రెడ్డి రాంరెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కాలనీ సమస్యల పరిష్కారానికి సంఘం సభ్యులు సమన్వయంతో కృషి చేయాలని ఆయన సూచించారు.

**ఈ కార్యక్రమంలో హాజరైన ప్రముఖులు**

పీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా, నాగోల్ మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, నాగోల్ సీఐ మక్బూల్ జానీ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు నాగోల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మంజులా రెడ్డి, చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జైపాల్ రెడ్డి, గణేష్ నాయక్, ఆలయ ధర్మకర్తలు కిరణ్, శ్రీనివాస్, నాయకులు వెంకట్రామ్ రెడ్డి, గాంధీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## హుడా కాంప్లెక్స్ లో ఉచిత మెగా హెల్త్ శిబిరం

ఎల్బీనగర్, మార్చి 01 (భారత శక్తి): కొత్తపేట హుడా కాంప్లెక్స్ లో యంగ్ రేస్ ఆర్గనైజేషన్, ప్రణవ గ్రూప్, యశోద హాస్పిటల్ సంయుక్తంగా చేపట్టిన ఉచిత మెగా హెల్త్ శిబిరం నిర్వహించారు.. ఈ రోజుల్లో బిజి లైఫ్ లో ప్రజలు ఆరోగ్యం మీద శ్రద్ధ చూపకపోవడంతో కల్తీ ఆహారం, నీరు పొల్యూషన్స్ వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ప్రజల్లో అవగాహన కల్పించాలని ఈ మెగా హెల్త్ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో అన్ని విభాగాల డాక్టర్స్ అన్ని టెస్టులు చేసి తగిన మందులు పంపిణీ చేశారు. ప్రజలు ప్రతి ఆరు నెలలు ఒకసారి వైద్య పరీక్షలు చేసుకొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆరుట్ల సురేష్,లోకసాని కొండల్ రెడ్డి,యానాల రవీందర్ రెడ్డి, పవన్, సూగూరప్ప, ఆకుల అరుణ్, పప్పీ మనోహర్, బొడ్డు ప్రవీణ్, శివ, గణేష్, అరవింద్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతతోనే సమాజ వికాసం: నవజీవన్ రెడ్డి

ఎల్బీనగర్, మార్చి 1 (భారత శక్తి): మహిళల సాధికారతతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నాగోల్‌లోని నిమంత్రాన్ ప్యాలెస్‌లో మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణా సురేందర్ యాదవ్‌లతో కలిసి మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు కుటుంబానికే కాకుండా సమాజానికి బలమైన ఆధారస్తంభాలని కొనియాడారు. వారి విద్య, ఆరోగ్యం, భద్రతకు పెద్దపీట వేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి రంగంలో మహిళలు తమదైన ముద్ర వేయడం గర్వకారణమని పేర్కొన్నారు.

* **మాజీ కార్పొరేటర్ కు గజమాలతో సత్కారం**

అనంతరం హయత్ నగర్ డివిజన్ పరిధిలోని ఆంధ్ర బ్యాంక్ ఎంక్లేవ్ ఫేస్ 1 కాలనీవాసులు నవజీవన్ రెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు. తమ కాలనీలో సి.సి. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల వంటి మౌలిక వసతుల కల్పనలో ఆయన చూపిన చొరవకు కృతజ్ఞతగా ఈ సన్మానం చేసినట్లు కాలనీ ప్రతినిధులు తెలిపారు. ప్రజల ఆశీస్సులు, ప్రేమాభిమానాలే తనకు బలమని, కాలనీల అభివృద్ధికి ఎల్లప్పుడూ అందుబాటులో






ఉంటానని ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నగేష్, ప్రతినిధులు వెంకటేష్, రాజు, రవి, నర్సింగ్ రావు, జంగయ్య, రెడమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సైన్స్ ప్రదర్శన

ఎల్బీనగర్, మార్చి 01 (భారత శక్తి): మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సరూర్ నగర్ విద్యార్థులు ఆగస్త్య ఇన్నోవేషన్ ఎక్స్ ప్రెస్ ఆధ్వర్యంలో ఇద్దుగంటి రాంరెడ్డి ఫంక్షన్ హాలులో రెండు రోజులు సైన్స్ ఫైర్ జరిగింది. ఈ సైన్స్ ఫైర్ లో బొమ్మనగుడి, లింగోజీగూడ, కర్మాన్ ఘాట్, ఆర్కేపురం, తెల్లాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొని ఎయిర్ పొల్యూషన్ కంట్రోల్, రోబో, ఆకాశయాన పాడ్ మోటర్లు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రణీత్,బాబీ, అజయ్,శ్రీతి, శ్రద్ధ రాంప్రసాద్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.





## హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ వద్ద భారీ భద్రత

హైదరాబాద్, మార్చి 1 (భారత శక్తి): అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గచ్చిబౌలి పోలీసులు అప్రమత్తమయ్యారు. నానక్‌రామ్‌గూడలోని యూఎస్ కాన్సులేట్ వద్ద సైబరాబాద్ పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి నేపథ్యంలో నగరంలో నిరసన ర్యాలీలు జరిగే అవకాశం ఉందన్న నిఘా




వర్గాల సమాచారంతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యగా కాన్సులేట్ పరిసరాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని సుమారు 50 మంది పోలీసులతో కాన్సులేట్ వద్ద ప్రత్యేక భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. కాన్సులేట్ వైపు వెళ్లే ప్రధాన రహదారిని తాత్కాలికంగా మూసివేసి, బారికేడ్లను ఏర్పాటు చేశారు. అటువైపుగా వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.